'గీత రచనాదీపిక' గ్రంథావిష్కరణ సభ

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: 12వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక బ్రాడీపేట సిపిఎం కార్యాలయం, కొరటాల మీటింగ్ హాలు సమావేశ మందిరంలో సాహితీ కళారత్న కొణతం నాగేశ్వరరావు రచించిన "గీత రచనాదీపిక" గ్రంథావిష్కరణ సభ జరుగుతుందని గుంటూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సోమేపల్లి వెంకటసుబ్బయ్య ఎస్ఎం సుభాని తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ గుజ్జర్ల మూడీ కృపాచారి గ్రంథాన్ని ఆవిష్కరిస్తారని హిందూ కళాశాల వైస్ ప్రిన్సిపల్ మేళం బాబురావు గ్రంథ స్వీకరణ చేస్తారని చెప్పారు. ఆత్మీయ అతిథులుగా రాష్ట్ర ప్రభుత్వ హంస అవార్డు గ్రహీత డాక్టర్ భూసరపల్లి వెంకటేశ్వర్లు, నాటక ప్రయోక్త, నటశేఖర తుర్లపాటి రాధాకృష్ణమూర్తి పాల్గొనే ఈ కార్యక్రమంలో భాషా ప్రవీణ ఎం కృష్ణ కిషోర్, సాహితీవేత్త కేజే రమేష్ గ్రంథ సమీక్ష చేస్తారని నగరంలోని సాహితీవేత్తలు అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

స్టూడెంట్ అభ్యాసన ప్రక్రియను మెరుగ్గా చేస్తున్న లీడ్

గుంటూరు: అంతర్జాతీయ ప్రమాణాలుగల పాఠ్యప్రణాళికతో, మల్టీమోడల్ బోధన అభ్యసన పద్ధతులతో, టెక్నాలజీ ఆధారిత పరిష్కారాలతో నెప్ 2020కి అనుగుణమైనది లీడ్ ఇంటగ్రేటెడ్ స్కూల్ సిస్టం.లోతుగా కాన్సెప్టులను అర్థం చేసుకోవడంలో, అన్ని సబ్జెక్టులలో నైపుణ్యం సాధించడంలోనూ విద్యార్థులకు తోడుగా నిలుస్తోంది. ఆంధ్రప్రదేశ్లోని లీడ్ పవర్డ్ స్కూళ్లలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో, కోవిడ్ సంబంధిత సవాళ్లు ఉన్నా సరే, దాదాపు 20 శాతం మేర స్టూడెంట్ అభ్యసన ఫలితాలను మెరుగు చేయగలిగింది. ఆంధ్రప్రదేశ్ లోని 240కి పైగా స్కూళ్లలో లీడ్ యొక్క ఇంటిగ్రేటెడ్ స్కూల్ సిస్టం ఇప్పటికే అమలు చేయడం ద్వారా రాష్ట్రంలో 90 వేల మంది విద్యార్థులకు ప్రయోజనం కలుగుతోంది. అంతకుమించి 2500 పైగా మందికి పైగా టీచర్లు ఇప్పటికే లీడ్ ద్వారా శిక్షణ పొంది సర్టిఫై అయ్యారని లీడ్ కో-ఫౌండర్, లీడ్ సుమీత్ మెహతా పేర్కొన్నారు.

బైక్ దొంగ అరెస్ట్

విశాలాంధ్ర-పొన్నూరు: ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైకులనే టార్గెట్గా చేసుకొని దొంగతనాలు చేస్తున్న యువకుడ్ని పొన్నూరు పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఈనెల 6వ తేదీన భావనగర్ కాలనీకి చెందిన చుండూరు రవి తన పల్సర్ బైకును ఇంటి ముందు పార్కు చేసి పొద్దున్నే లేచి చూడగా బైకు కనబడకపోవడంతో పొన్నూరు టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. అర్బన్ ఎస్ఐ షేక్ హసీమ్ సిబ్బందితో దర్యాప్తు చేయగా శుక్రవారం పొన్నూరు శివారు మార్కెట్ యార్డు దగ్గర అనుమానాస్పదంగా తిరుగుతున్న చుండూరు మండలం వలివేరు గ్రామానికి చెందిన ఖగ్గ ఆంజనేయులును అదుపులోకి తీసుకొని విచారించగా బైకును అపహరించినట్లు నిర్ధారించారు. అతని వద్ద నుంచి రెండు బైకులను స్వాధీనం చేసుకొని కోర్టు కోర్టుకు హాజరు పరిచినట్లు అర్బన్ ఎస్సై హసీమ్ తెలిపారు.

హత్యకేసులో నిందితుడి అరెస్ట్

విశాలాంధ్ర-తెనాలి : ఈ నెల 6న మమత బార్ వెనుక జరిగిన హత్య కేసులో ముద్దాయి అయిన వేముల నాగరాజును పోలీసులు అరెస్టు చేశారు. వేముల నాగ రాజు, గండికోట అంకారావు ఇద్దరు స్నేహితులు. ఇద్దరూ కలిసి తాపీపని చేసేవాళ్ళు. మార్చి 6వ తేదీన నాగరాజు ఇంట్లో ఉదయం నుండి సాయంత్రం వరకు ఇద్దరూ కలసి మద్యం సేవిస్తూ రాత్రి 8 గంటల సమయంలో అంకారావు నాగరాజుతో వాదన పెట్టుకుని నాగరాజుని అసభ్యంగా మాట్లాడాడని, అతని మాటలు అవమానంగా భావించిన నాగరాజు కత్తిపీట చెక్కతో అంకారావు తలమీద పలుమార్లు కొట్టగా తలపగిలి అక్కడిక్కడే చనిపోయాడని చెప్పాడు. మార్చి 9వ తేదీన 35వ వార్డు విఆర్ఒ ఎండూరి జయకాంత్ దగ్గరకు నాగరాజు వెళ్ళి స్వచ్ఛందంగా నేరం ఒప్పుకున్నాడు. వీఆర్ఒ ముద్దాయిని తెనాలి 2టౌన్ పోలీసులకు అప్పగించాడు. ముద్దాయిని పోలీసులు అరెస్టు చేసి కోర్టు ముందు హాజరు పరిచారు.

రాడ్ బెండింగ్ కార్మికుడు మృతి

విశాలాంధ్ర-పొన్నూరు: పట్టణంలోని 9 వార్డు క్యాబిన్ పేటకు చెందిన రాడ్ బెండింగ్ కార్మికుడు దుగ్గిరాల రమేష్(32) శుక్రవారం ఒకటో వార్డులోని అపార్ట్మెంట్ పై పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న అర్బన్ పోలీసులు ఘటన స్థలానికి వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాల తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడి కేసులో ముద్దాయిలు అరెస్టు

విశాలాంధ్ర-తాడేపల్లి: ఈనెల 8 తేదీ రాత్రి చెన్నైయ్కి చెందిన సుకుమార్, మోహన్ ప్రకాశం బ్యారేజీ పై నిద్రిస్తున్న సమయంలో దాడి చేసి గాయం చేసిన ఘటనలో నిందితులు ఐదుగురిని తాడేపల్లి పోలీసులు అరెస్టు రిమాండ్ తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు జిల్లా ఎస్పి ఆరిఫ్ హఫీజ్ ఆదేశాల మేరకు నార్త్ డిఎస్పి రాంబాబు ఆధ్వర్యంలో ముద్దాయిలు రవీందర్, భరత్, రతన్, అజిత్, ఆటో డ్రైవర్ను అరెస్టు చేసి రిమాండ్కి తరలించినట్లు తాడేపల్లి సిఐ శేషగిరిరావు మీడియా సమావేశంలో తెలిపారు. ఈ సమావేశంలో సీఐ సాంబశివ రావు, ఎస్సైలు నారాయణ, వినోద్, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

జైనీస్ పాఠశాలలో సైన్స్ డే

విశాలాంధ్ర-దుగ్గిరాల: మండల పరిధిలోని తుమ్మపూడి గ్రామంలో జైనీస్ ఇంగ్లీష్ పాఠశాల నందు శుక్రవారం సైన్స్ డే నిర్వహించారు. ఒకటవ తరగతి నుండి ఏడవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు తమ ప్రతిభ చాటేందుకు వివిధ రకాల పరికరాలను తయారుచేసి ప్రదర్శినిగా ఏర్పాటు చేశారు. పాఠశాల డైరెక్టర్ సుధీర్ జోసెఫ్ ఆధ్వర్యంలో జరిగిన సైన్స్ డే ను అడ్వైజర్ చుక్కా ప్రభావతి పరిశీలించి విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా నాగార్జున్ సాగర్, జూ పార్కు, పాఠశాల, ట్రాఫిక్ రూల్స్ , హైడ్రాలిక్ క్రేన్స్, గ్రామాలు, వంటివి తయారుచేసి ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా అడ్వైజర్ ప్రభావతి మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రతిభను చాటేందుకు వివిధ రకాల పరికరాలను తయారు చేయడం ఎంత ఆనందదాయక మన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ శేష గిరిరావు, గ్రేస్ మేరీ, రవికుమార్, శ్యామ్, పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **RADHAKRISHNA EMADABATTUNI** (Old Name), **S/o. SINGAIAH,** resident of D.No: 8-24, Jonnalagadda, Guntur District-522034, Andhra Pradesh. I have changed my name as **RADHAKRISHNA IMADABATTUNI** (New Name). Hereafter my name is known as **RADHAKRISHNA IMADABATTUNI** (New Name).

CHANGE OF NAME

I, **KAYYURI RAVINATH** (Old Name), S/o Kayyuri Rama Rao, R/o. F.No.201, Revathi Residency, 3rd Lane Devapuram, Guntur - 522006, Guntur District, Andhra Pradesh, have changed my name to **KAYYURI RAVINADH.** Hereafter my name is known as **KAYYURI RAVINADH.**

ఉద్యోగ, ఉపాధ్యాయులపై వేధింపులు ఆపాలి : సీపీఐ, సీపీఎం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులపై రాష్ట్ర ప్రభుత్వం వేధింపులు ఆపాలని, సంఘాల నాయకులను చర్చలకు ఆహ్వానించి సమస్యలు పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్కుమార్, సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు కోరారు. శుక్రవారం స్థానిక శంకర్ విలాస్ సెంటర్లో జరిగిన నిరసన కార్యక్రమంలో వారు ప్రసంగించారు. 2019 ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే సీపీఎస్ రద్దు చేస్తా మని, పాత పెన్షన్ స్కీమ్ను పునరుద్ధరిస్తామని, ఉద్యో గుల సమస్యలు పరిష్కరిస్తామని వాగ్దానం చేసి అధికారం లోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులకు మొండి చేయి చూపిందని, సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తున్న ఉద్యోగులపై నిర్బంధకాండను ప్రయోగిస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించలేక పోతుందని, ముఖ హాజరు, యాప్ల పేరుతో ఉద్యోగులను భయాందోళనకు గురి చేస్తూ మానసిక వత్తిడికి గురి చేస్తుందని, ఫలితంగా ఉద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు పునరావృతం అవుతున్నాయని చెప్పారు. ఎంఎల్సి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం నోటీసులు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ఉపాధ్యాయ నియోజకవర్గాలలో ప్రతినిధులను ఎన్నుకోవటం, వారి గెలుపుకు కృషి చేయడం రాజ్యాంగం కల్పించిన హక్కు అని, ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వారికి నోటీసులు ఇవ్వటం అంటే ఈ హక్కును కాలరాయడమేనని చెప్పారు. జి.ఓ.నెం.1 పేరుతో ఉద్యోగులు, ఇతర ఉద్యమకారులపైన, ప్రతిపక్షాలపై నిర్బంధం ప్రయోగించడం రాజ్యాంగ విరుద్ధమైన చర్య అని, దీనిని మానుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని చెప్పారు. ఉద్యో గులు, ఉపాధ్యాయులు వారి సమస్యల పరిష్కా రానికి ఈ నెల 13 నుండి జరుపతలపెట్టిన సమ్మెకు సీపీఎం, సీపీఐలు సంపూర్ణ మద్దతును తెలిపారు. వెంటనే ప్రభుత్వం స్పందించి సంఘాల నాయకలను చర్చలకు ఆహ్వానించి సమస్యల పరిష్కారానికి పూనుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి సీపీఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ అధ్యక్షత వహించగా జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.నేతాజి, సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, నాయకులు ఎ.అరుణ్కుమార్, వలి, నాసర్ జి, జె.చైతన్య, మరియదాసు, ఎం.రవి, కె.కమలాకర్, బూరు గ వెంకటేశ్వర్లు, డి.రమేష్, ముత్యాలరావు, ఎల్.అరుణ, ఎన్.శివాజి, పెన్షనర్ల సంఘం నాయకులు గంగాధర రావు, దుర్గారావు, రామారావు, సాంబశివ రావు, జి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సేవలు నిరుపమానం : కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్ : రెడ్ క్రాస్ ద్వారా గుంటూరు జిల్లాలో చేస్తున్న సేవలు నిరుపమానమని కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. గుంటూరు జిల్లాలో రెడ్ క్రాస్ స్థాపించి 87 సంవత్సరములు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం గుంటూరు రెడ్ క్రాస్ భవన్లో ఏర్పాటు చేసిన సమావేశానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల నివారణ కొరకు, కోవిడ్ వంటి స్థితి ఏర్పడినప్పుడు ప్రాణాలకు సైతం తెగించి సేవలు అందజేసే సేవ సంస్థ ఒక రెడ్ క్రాస్ మాత్రమేనన్నారు. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలలో రెడ్ క్రాస్ విస్తరిస్తూ సమాజంలో క్షేత్రస్థాయి వరకు తన సేవలను అందజేస్తున్నదని, అటువంటి రెడ్ క్రాస్ సంస్థలో ప్రతి ఒక్కరు సభ్యత్వం తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ రవి వడ్లమాని ప్రసంగిస్తూ రెడ్ క్రాస్ సేవలను వివరించారు. రెడ్ క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ పి రామచంద్రరాజు ప్రసంగిస్తూ రాబోయే రోజుల్లో దాతల సహకారంతో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఒకేసారి ముగ్గురు రక్తదానం చేసేలా ఏర్పాటు కలిగిన మొబైల్ బ్లడ్ డొనేషన్ వ్యాన్ను కలెక్టర్ పరిశీలించారు. న్యాయవాది జి సాయి కృష్ణ శ్రీనివాస్ బహుకరించిన మారుతి ఏకో వ్యాన్ను రెడ్ క్రాస్కి అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ రెడ్ క్రాస్ జిల్లా కన్వీనర్ ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, మాజీ ఆదాయపు పన్ను శాఖ కమిషనర్ వినయ్ కుమార్, జూపూడి రంగరాజు, తెనాలి రెడ్ క్రాస్ చైర్మన్ ముమ్మనేని భానుమతి, వైద్యులు డాక్టర్ కొండబోలు పద్మజ, డాక్టర్ పావని ప్రియాంక పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి : కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: గుంటూరు నగరంలో నూతనంగా చేపడుతున్న రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనుల్లో జాప్యం, నాణ్యతా ప్రమాణాలు తగ్గకుండా ఇంజినీరింగ్ అధికారులు సునిశితంగా పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ విద్యా నగర్లో రూ.60 లక్షలతో నిర్మాణం చేసిన సిసి రోడ్, డ్రైన్, రూ.10లక్షలతో చేపట్టిన కొరిటెపాడు మెయిన్ రోడ్ డివైడర్ మరమత్తులు, పండరి పురంలోరూ.45 లక్షలతో చేపట్టిన సిసి డ్రైన్ పనులను, రూ.1.80 కోట్ల ఎస్.క్యాప్ నిధులతో విస్తరణ, డ్రైన్ టు డ్రైన్ రోడ్ నిర్మాణం చేపట్టనున్నజెకెసి కాలేజి రోడ్ తదితర ప్రాంతాల్లో పరిశీలించి, రోడ్ల, డ్రైన్ల నాణ్యత, కొలతలను తనిఖీ చేసి సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. పనుల వేగంతోపాటు నాణ్యతా ప్రమాణాలు నూటికి నూరు శాతం పాటించేలా ఎమినిటి కార్యదర్శులు, ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. పర్యటనలో ఎస్.ఈ. భాస్కర్, ఈ.ఈ. సుందర్రామి రెడ్డి, డి.ఈ.ఈ. మహ్మద్ రఫిక్, ఏసిపి అజయ్ కుమార్, టి.పిఎస్. గోవర్ధన్, ఎడిహెచ్ రామారావు, ఏ.ఈ.లు సూరిబాబు, సునీల్ కుమార్, అనూష, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

మసీదులు మరమ్మతులు చేయించాలని వినతి

విశాలాంధ్ర-గుంటూరు : రంజాన్ మాసం ప్రారంభమౌతున్న నేపథ్యంలో రాష్ట్రంలో ఉన్న అన్ని మసీదులు, మదర్సాలు, దర్గాలు, ఖబరస్తాన్లకు మరమ్మతులు చేయాలని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం నేషనల్ వైస్ ఛైర్మన్ జమీల్ అహ్మద్ బేగ్ కోరారు. ఈ మేరకు ప్రభుత్వ సలహాదారు, మాజీ ఎమ్మెల్యే ఎస్ఎం జియావుద్దీన్ను శుక్రవారం ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ముస్లింలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్ళారు. జమీల్ అహ్మద్ బేగ్ మాట్లాడుతూ నమాజ్ వేళలలో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో పనిచేసే ఉద్యోగులు, ఆయా సంస్థలలో పనిచేసే కార్మికులకు నమాజ్ చేసుకునేందుకు అనుమతులు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. రంజాన్ మాసంలో నిరంతరాయంగా కరెంటు, నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. స్పందించిన జియావుద్దీన్ సీఎం జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళి ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామి ఇచ్చినట్లు జమీల్ అహ్మద్ బేగ్ తెలిపారు. ఆయా సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని పోస్టు ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి పంపినట్లు బేగ్ తెలియజేశారు.

డాక్టర్ మండవ సేవలు అభినందనీయం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: పోలీసు డాక్టర్గా, పేదల వైద్యుడిగా డాక్టర్ మండవ శ్రీనివాసరావు అందించిన వైద్య సేవలు ఎంతో అభినందనీయమని ఏపీ సిఐడీ చీఫ్ ఎన్.సంజయ్ అన్నారు. డాక్టర్ మండవ శ్రీనివాసరావు పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం స్థానిక కొత్తపేటలోని సాయిరత్న మల్టీస్పెషాలిటీ హాస్పటల్లో మెగా రక్తదాన శిబిరం జరిగింది. సిఐడీ చీఫ్ సంజయ్ ముఖ్య అతిథిగా విచ్చేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. తొలుత భారీ కేక్ను కట్ చేశారు. క్యాలెండర్ను డాక్టర్ మండవ వైద్య సేవలతో ముద్రించిన పుస్తకాలను సంజయ్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు, డాక్టర్ల మధ్య డాక్టర్ మండవ శ్రీనివాసరావు అనుసంధాన కర్తగా వ్యవహరించారన్నారు. ప్రభుత్వ వైద్యుడిగా ఉంటూ ఎంతోమంది పేదలకు ఉచిత వైద్య సేవలు సొంత క్లీనిక్లో అందించి, అందరి మన్ననలు పొందారన్నారు. పోలీసు వైద్యుడిగా గుర్తింపు పొందారన్నారు. డాక్టర్ మండవ శ్రీనివాసరావు మాట్లాడుతూ తనకు ఊహ తెలిసినప్పటి నుంచి పేదలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నానని, సేవలందించడంతో తనకు ఎంతో తృప్తి లభిస్తోందన్నారు. సీనియర్ న్యూరాలజిస్టు డాక్టర్ చక్కా శివరామకృష్ణ మాట్లాడుతూ ఉచిత వైద్య సేవలతో పేదల వైద్యుడిగా జిల్లాలో డాక్టర్ మండవ శ్రీనివాసరావు అందరికి సుపరిచితులయ్యారన్నారు. కార్యక్రమంలో జనసేన నగర అధ్యక్షుడు నేరేళ్ల సురేష్, జీజీహెచ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్, డీఎస్పీ సీతారామయ్య, కార్పొరేటర్ పోతురాజు సమత, పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

13న గ్రాడ్యుయేట్ ఓటర్లు ఓటు వేయాలి

విశాలాంధ్ర-గుంటూరు : తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పి.చంద్రశేఖర్ రెడ్డికి, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యాం ప్రసాద్ రెడ్డికి ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి సంపూర్ణ మద్దతు తెలిపారని, కావున వెంకటరామిరెడ్డి సూచనలు మేరకు సంఘ బాధ్యులందరూ ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో మన సభ్య సంఘాలలో ఉన్న టీచర్, గ్రాడ్యుయేట్ ఓటర్ల అందరికీ చెప్పి ఓటు వేయించి గెలిపించాల్సిన బాధ్యత మన అసోసియేషన్పైన ఉందని గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బీఆర్ కిషోర్ ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక సంఘం సమ్మె నిర్వహణకు పిలుపునివ్వడం జరిగిందని, సమ్మెలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు కూడా పాల్గొనాలని ప్రలోభాలకు గురిచేస్తున్నారని, ఏ ఒక్క ఉద్యోగి ఈ సమ్మెలో పాల్గొనవద్దని విజ్ఞప్తి చేశారు. నిరుద్యోగులుగా ఉన్న మనకు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులుగా ప్రభుత్వం అవకాశం కల్పించడంతో పాటు రెగ్యుల్ ఉద్యోగులుగా చేసిందని చెప్పారు. 1.30 లక్షల ఉద్యోగాలు ఇచ్చిన ప్రభుత్వం ఋణం తీర్చుకుందామని అన్నారు. ప్రజలకు ఉన్నత సేవలు అందిస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువచ్చి మన సమస్యలు ప్రభుత్వంనకు తెలియపరచి ఆ దిశగా మనకు రావలసిన ప్రయోజనాలు సాధించుకుందామని అన్నారు.

ముందస్తు వైద్య పరీక్షలు ఎంతో ఉత్తమం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: వ్యాధులు రాకుండా ముందస్తుగా వైద్య పరీక్షలు చేయించు కుని జాగ్రత్తలు తీసుకో వడం ఎంతో ఉత్తమమని కేర్వెల్ హాస్పటల్ అధినేత, ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, లివర్ స్పెషలిస్టు డాక్టర్ షేక్ నాగూర్బాషా అన్నారు. స్థానిక గుంటూరువారితోట 7వ లైనులోని కేర్వెల్ హాస్పటల్లో ఉచిత వైద్య శిబిరం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ నాగూర్బాషా మాట్లాడుతూ ఆధునిక జీవన శైలి వల్ల జీర్ణకోశ వ్యాధుల సమస్యలు, లివర్ సంబంధిత సమస్యలు బాగా పెరిగిపోతున్నాయని అన్నారు. వ్యాధులను ముందస్తుగానే గుర్తించే అత్యాధునిక వ్యాధి నిర్ధారణ పరీక్షలు నేడు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి నెలా సుమారు రూ.10వేలు విలువ చేసే ఫైబ్రోస్కాన్ పరీక్షను తమ హాస్పటల్లో ఉచితంగా చేస్తున్నామని, పేదలకు కార్పొరేట్ వైద్యం నామమాత్రపు ఫీజులతో అందించాలనే ఉద్దేశ్యంతో పలు వైద్య పరీక్షల్లో అత్యంత రాయితీతో సేవలందిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం డాక్టర్ నాగూర్బాషా పుట్టిన రోజు సందర్భంగా పలువురు సన్మానించారు. భారీ కేక్ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ షేక్ గౌస్బాషా, హాజీ షేక్ మస్తాన్వలి, షేక్ అర్షిత్ పటేల్, కార్డియాలజిస్ట్ డాక్టర్ శివశంకర్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ నరేంద్రరెడ్డి, జనరల్ సర్జన్ డాక్టర్ హర్షవర్ధన్, నెఫ్రాలజిస్టు డాక్టర్ మొహమ్మద్ అస్లాం, తదితరులు పాల్గొన్నారు.

గ్లకోమా వ్యాధిపై అవగాహన

విశాలాంధ్ర-తెనాలి : పట్టణంలో ప్రపంచ గ్లకోమా వారోత్సవాలు సందర్భంగా ప్రజలకు కంటికి సంబంధించిన గ్లకోమా అని పిలువబడే (నీటికాసులు) వ్యాధిపై అవగాహన కల్పిస్తూ శుక్రవారం తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల వైద్యబృందం ర్యాలి, సదస్సు నిర్వహించారు. ప్రభుత్వ వైద్యశాల నుండి ర్యాలీ పట్టణంలో పలువీధులలో నిర్వహించారు. ర్యాలీని సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యలవాణి ప్రారంభించి మాట్లాడుతూ గ్లకోమా వ్యాధి వల్ల కంటినరాలు దెబ్బతిని దృష్టి కోల్పోతారని, అందువల్ల తొలిదశలోనే గుర్తించి తగిన చికిత్స తీసుకోవడం వల్ల గ్లకోమా బారి నుండి కాపాడుకోవచ్చన్నారు. వంశపారంపర్యంగా కూడా ఈ వ్యాధి బారిన పడే అవకాశం ఉందని చెప్పారు. తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో వైద్యపరికరాలు, వైద్యులు అందుబాటులో ఉన్నారని తెలిపారు. కంటి విభాగాధిపతి డాక్టర్ ఎప్సిబాయ్ మాట్లాడుతూ గ్లకోమా వ్యాధి లక్షణాలుగా కంటిలో ఎరుపుదనం, దురద, నొప్పి, నీరు కారడం వంటి లక్షణాలు కన్పిస్తే గ్లకోమా వ్యాధి లక్షణాలుగా భావించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కంటికి సంబంధించిన ఎటువంటి ఇబ్బందులు ఉన్నా ఆరోగ్యశ్రీ సేవలు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ షేక్ షబిహానా, డాక్టర్ సుప్రజ, శ్యామ్ప్రసాద్, లాస్య, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

బైకుల దొంగలు అరెస్టు

విశాలాంధ్ర-తెనాలి : గుంటూరు, బాపట్ల, కృష్ణా జిల్లాలలో వివిధ చోట్ల బైకులు దొంగతనం చేసిన ముగ్గురు బైకు దొంగలను తెనాలి తాలూక పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. శుక్రవారం తెనాలి డియస్పీ స్రవంతిరాయ్ తెనాలి తాలూక పోలీస్టేషన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. బైకులు పోగొట్టుకున్నవారు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయ్యాలన్నారు. బైకుదొంగలను చాకచక్యంగా పట్టుకున్న సిఐ, యస్.ఐ. సిహెచ్ వెంకటేశ్వర్లు, హెచ్సి బాల బాబూరావు, పిసిలు రాము శ్రీనివాస్ రామకృష్ణ నారాయణలను డిఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

జాతీయ డీవార్మింగ్ డే విజయవంతం చేయాలి



విశాలాంధ్ర-ఫిరంగిపురం: ఈ నెల 14వ తేదిన నిర్వహించే జాతీయ డీవార్మింగ్ దేను విజయవంతం చేయాలని ఎంపీడీవో దాసరి అనురాధ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ మీటింగ్ హాల్లో డీ వార్మింగ్ డే పై శుక్రవారం అవగాహన కార్యక్రమం జరిగింది. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఉపాధ్యా యులు, ఎ.ఎన్.ఎం.లు, అంగన్వాడీ సూపర్వైజర్స్, ఆషాలు పాల్గొన్న ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో ప్రాథమి పాఠశాలలు నుంచి ఇంటర్ విద్యార్థులందరికి డీవార్మింగ్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. 14వ తేది పాఠశాలలకు రాని విద్యార్థులకు 18వ తేదిన నులిపురుగులు మాత్రులు అందజేయాలన్నారు. అదేవిధంగా నుదురుపాడు పిహెచ్సి వైద్యాధికారి సి.హెచ్. యానీ గ్రేస్ మాట్లాడుతూ 2నుంచి 19 వయస్సు లోపు పిల్లలకు డీవార్మింగ్ మాత్రలు అందజేయవచ్చున్నారు. జ్వరం, వాంతులు, అనారోగ్యంతో ఉన్నావారికి నులిపురుగులు మాత్రలు వేయకూడదని తెలియజేశారు. 1-2 సంవత్సరం లోపు పిల్లలకు అర ట్యాబ్లెట్ వేయాలని, 2-19సం.ముల వారందరికి ఒక ట్యాబ్లెట్ వేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. నులిపురుగులు మాత్రలు వాడటం వలన విద్యార్థులు, చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని రక్త హీనత లోపాలు లేకుండా ఉండటానికి ఎంతో ఉపయోగకరమని వైద్యాధికారి అవగాహన కల్పించారు. ఈ అవకాశాన్ని అందరు సద్వినియోగం చేసుకొనే విధంగా సిబ్బంది తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి సాల్మన్రాజు, ఎంపిహెచ్ఈవో తెనాలి లూర్దురాజు,సిహెచ్.వో. వెంకటలక్ష్మీ, పిహెచ్ఎన్. గాయత్రీదేవి తదితదరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ

విశాలాంధ్ర-తెనాలి : శుక్రవారం మున్సిపల్ కమీషనర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 14 మంగళవారం పాఠశాలల్లో విద్యార్థులకు అల్బండజాల్ టాబ్లెట్స్ పంపిణీ చేస్తామని డియం అండ్ హెచ్ఒఈ అన్నపూర్ణ తెలిపారు. 1 నుండి 19 సంవత్సరాల వయస్సు గల బాలబాలికలు అందరూ ఈ మాత్రలు వేసుకోవాలని చెప్పారు. ఈ టాబిలెట్స్ వలన రక్తహీనత శారీరక, మానసిక ఎదుగుదల లోపం లేకుండా, వ్యాధి నిరోధక శక్తిని కూడా పెంచుతుందన్నారు. ఎటువంటి సైడ్ఎఫెక్ట్స్ లేకుండా వైద్యుల పర్యవేక్షణలో అంగన్వాడి, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యార్థులందరికి ఇస్తారన్నారు. ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ యం.జశ్వంతరావు, యంఆర్ఒ కె.రవిబాబు, హెల్త్ సూపర్వైజర్ ప్రేమ్చంద్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

పెన్షన్ విడుదల చేయాలని నిరసన

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల 1వ తేదీన పెన్షన్ విడుదల చేయాలని, డీఏ బకాయిలు, పీఆర్సీ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, ఈహెచ్ఎస్ అన్ని గుర్తింపు పొందిన హాస్పిటల్స్ వైద్యం చేయాలని తదితర డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల జిల్లా కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ నిరసనలో ఏపీఎస్జీఆర్ఈఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.నాగరాజు, అసోసియేషన్ నేతలు సాయిబాబు, ఎ.సుబ్బారావు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఈఓను తొలగించండి

విశాలాంధ్ర-గుంటూరు : స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ ఈఓను తొలగించాలని దేవాదాయ శాఖ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డికి బీజేపీ నేతలు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు పాటిబండ్ల రామకృష్ణ మాట్లాడుతూ ఆలయంలో ఈఓ సోదరుడు పెత్తనం చేయడం తగదన్నారు. వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రభుత్వం పాత కమిటీని రద్దుచేసి ఒక కొత్త ఈఓను తీసుకువచ్చిందని, ఆ దేవాలయంలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఈఓ పాదర్తి దుర్గారావు సోదరుడు ఆలయంలో అన్నిట్లో జోక్యం చేసుకుంటున్నారని భక్తులు ఆవేదన చెందుతున్నారన్నారు. ఆలయంలో ఈఓని తీసివేసి ఎప్పటిలాగే కమిటీ వేసుకోమని కోర్టు చెప్పినా ఈ ప్రభుత్వం పెడచెవిన పెడుతుందని అన్నారు. దీనిపై తక్షణమే స్పందిచాలని డీసీ చంద్రశేఖర్ రెడ్డిని కోరారు. స్పందించని పక్షంలో ధర్నాలు నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చరక కుమార్ గౌడ్, వనమా నరేంద్ర, మద్దెల కృష్ణకాంత్, తుళ్లిమల్లి రామకృష్ణ, డాక్టర్ దారం అంబేద్కర్, ప్రతాప్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎస్ఆర్ఎంలో ఎంటెక్ అడ్మిషన్లు ప్రారంభం

విశాలాంధ్ర-మంగళగిరి : ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో 2023-24 విద్యా సంవత్సరానికి ఎంటెక్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, మెకానికల్ ఇంజినీరింగ్ డిపార్ట్మెంట్లకు సంబంధించిన ప్రోగ్రామ్స్లో విద్యార్థులకు ప్రవేశాలను కల్పిస్తోంది. ఈ మేరకు అడ్మిషన్స్ డైరెక్టర్ యలంపల్లి శివశంకర్ శుక్రవారం అడ్మిషన్లకు సంబంధించిన వివరాలను ఓ ప్రకటనలో వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయిలో ఇంజినీరింగ్ విద్యా ప్రమాణాలను అందిస్తోన్న ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ నిష్ణాతులైన ప్రొఫెసర్లతో ఎంటెక్ కోర్సులను నిర్వహిస్తోంది. టెస్ట్, ఇంటర్, బీటెక్లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన బీటెక్ విద్యార్థులు ఎంటెక్ కోర్సుకు దరఖాస్తు చేసేందుకు అర్హులుగా డాక్టర్ శివశంకర్ పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఏపీ ఎస్ఆర్ఎం వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎంటెక్ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ ప్రోగ్రాములు ఉంటాయనీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్లో వీఎల్ఎస్ఎస్ఐ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, మెకానికల్ ఇంజినీరింగ్ డిపార్ట్మెంట్లో థర్మల్ ఇంజనీరింగ్, మెటీరియల్స్ అండ్ మాన్యుఫాక్చరింగ్ ప్రోగ్రాములను అందుబాటులో ఉంచినట్లు వివరించారు. వచ్చే ఆగస్టులో తరగతులు ప్రారంభం కానున్నాయని వివరించారు.

కొమ్మారెడ్డి కిరణ్ను సన్మానించిన ఫాదర్లు

విశాలాంధ్ర-తాడేపల్లి: గుండిమెడ గ్రామంలోని ఆర్.సి.ఎం చర్చి నందు తపస్సు కాల ఆరాధనలు 8,9 తేదీలలో విచారణ గురువులు రెవ ఫాదర్ బొక్కా బాలశౌరి ఆధ్వర్యంలో జరిగాయి. ఈ తపస్సు కాల ఆరాదన సభలకు రెవ ఫాదర్ మొలుగుపాటి ప్రకాష్ ముఖ్య అతిథులుగా పాల్గొని దీక్ష, ఉపవాసం, దాన దర్మాలు అనే అంశాలపై బోదించారు. రెవ.ఫాదర్ శౌరిబాబు, మరియబాబు, దివ్య పూజాబలి సమర్పించారు. ఈ కార్యక్రమానికి పలు గ్రామాల నుండి దీక్షాపరులు, భక్తులు హజరయ్యారు. అనంతరం ఈ సభలకు అన్నదానం చేసిన కొమ్మారెడ్డి కిరణ్ని ఫాదర్లు సంఘస్తులు సన్మానించారు.

ఘనంగా గ్రంథాలయం పున:ప్రారంభం



విశాలాంధ్ర-దుగ్గిరాల : మండల పరిధిలోని ఈమని గ్రామంలో ఆరు దశాబ్దాల నెహ్రూ గ్రంథాలయ పునరుద్ధరణ సభను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విలేజ్ డెవలప్మెంట్ ఫారం కన్వీనర్ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో జరిగిన సభకు ముఖ్యఅతిథిగా ఎంపీడీవో కుసుమ శ్రీదేవి హాజరై మాట్లాడారు. ముందుగా గ్రంథాలయాన్ని ప్రారంభించి, స్వాతంత్ర సమరయోధులు మహాత్మ గాంధీ, జవహర్లాల్ నెహ్రూ, పొట్టి శ్రీరాములు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి విష్ణు మూర్తి అధ్యక్షత వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ 1961వ సంవత్సరంలో చేపట్టిన గ్రంథాలయాన్ని మళ్లీ ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిద్దిల శ్రీవాణి ఉజ్వల హారణి, ఎంపీటీసీ సభ్యులు పసుపులేటి సాయి చైతన్య, వార్డు సభ్యులు గ్యార బుల్లి అమ్మాయి, హెచ్ఎం ఏడుకొండలు, పంచాయతీ కార్యదర్శి సతీష్ బాబు, పసుపులేటి శ్రీనివాసరావు, కొండూరు సుధాకర్, అంబటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గుడ్ షెఫర్డ్‌లో మహిళా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-తాడేపల్లి: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు శుక్రవారం గుడ్ షేపేర్డ్ కాన్వెంట్లో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కె.రత్న కుమార్ సీనియర్ సివిల్ జడ్జ్ (లోకదాలత్) గుంటూరు, శ్రీనివాస కుమారీ ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు, శ్యామల (సీనియర్ అడ్వకేట్ గుంటూరు), సరిత అడిషనల్ సీడీపీఓ మంగళగిరి, సిస్టర్ లత ఛాలిస్ స్పాన్సర్ షిప్ ప్రోగ్రాం డైరెక్టర్, సిస్టర్ ఊర్మిళ కరుణాలయం ఇంచార్జ్ ఎం.ఎస్తేర్ రాణి, (స్వయంకృషి కోపరెటివ్ ట్రెజరర్) పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్, స్టాఫ్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర
పల్నాడు జిల్లా

సచివాలయ ఉద్యోగులు బాధ్యతతో మెలగాలి

విశాలాంధ్ర-రెంటచింతల: ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రభుత్వ పథకాలను గడపగడపకు తీసుకుని వెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్క సచివాలయ ఉద్యోగిపై ఉందని గురజాల ఆర్డీవో కె.అద్దయ్య తెలిపారు. శుక్రవారం రెంటాల సచివాలయాన్ని తహసీల్దార్ కే పుల్లారావుతో కలసి ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రతి ఉద్యోగి సచివాలయానికి వచ్చిన వారి పట్ల బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. అనంతరం గ్రామంలో ఉన్న 4 రేషన్ షాప్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా క్రమం తప్పకుండా నిత్యావసర వస్తువులను ఎండియూ వాహనాల ద్వారా ఇంటిదగ్గరకు వెళ్లి ఇవ్వాలని తెలిపారు. అనంతరం పీడీఎస్ బియ్యాన్ని పరిశీలించి, స్టాక్ వివరాలు తెలుసుకున్నారు.

ఆధునిక భారతంలో ధృవతార సావిత్రిబాయి పూలే

విశాలాంధ్ర-రెంటచింతల: భారతదేశ తొలి ప్రముఖ సంఘ సంస్కారిణిగా, తొలి ఆదర్శ ఉపాధ్యాయురాలిగా గణతికెక్కిన సావిత్రిబాయి పూలే ఆధునిక భారతంలో ధృవతార అని రెంటచింతల సర్పంచ్ పూజల పుష్పవతి అన్నారు. సావిత్రిబాయి పూలే 126 వర్ధంతిని పురస్కరించుకుని మండల పరిధిలోని సత్రశాల నాగార్జునసాగర్ టెయిల్ పాండ్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పూలే విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. సాంఘిక దురాచారాల నిర్మూలన కోసం, బాలికల విద్యా బోధనకు అంకితమై తన జీవితాన్ని త్యాగం చేసిన సావిత్రిబాయి పూలే ఆదర్శప్రాయురాలన్నారు. కార్యక్రమంలో కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ సభ్యులు నారాయణపురం శ్రీనివాసరావు, గాదె లూర్థుమర్రెడ్డి, టెయిల్ పాండ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వివాహానికి జ్ఞానేశ్వర ఫౌండేషన్ సహాయం

విశాలాంధ్ర-చిలకలూరిపేట: నిరుపేదలు, అభాగ్యులులకు జ్ఞానేశ్వర్ ఫౌండేషన్ అండగా ఉంటుందని, వారి అభ్యున్నతి కోసమే పలు సేవా కార్యక్రమాలు చేపడుతోందని ఛైర్మన్ షేక్ జాన్ సైదా తెలిపారు. చిలకలూరిపేట మండలం మద్దిరాల గ్రామానికి చెందిన షేక్ పెద్ద మాబు సుభాని సోదరి ఖాజా మొహిద్దీన్ బీ వివాహానికి జ్ఞానేశ్వర ఫౌండేషన్ తరుపున 20 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆనందోత్సవాలతో ఉండాలన్నదే తన లక్ష్యమని, అందుకే తన వంతుగా వారి చేయూతకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోతవరం సర్పంచ్ భాషా మేస్త్రీ, మానుకొండ శేషిరెడ్డి, జమ్మలమడక ఆదిబాబు తదితరులు ఉన్నారు.

అమ్మవారి సేవలో ఆర్ఐ

విశాలాంధ్ర-దుర్గి: మండల పరిధిలోని నిదానంపాడులో వేంచేసియున్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అడిగొప్పల శ్రీలక్ష్మీ అమ్మవారిని మండల రెవిన్యూ ఇన్స్‌పెక్టర్(ఆర్ఐ) ఎస్.శ్రీనివాసరావుర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు ప్రత్యేక పూజలు చేసి, పూలమాలతో సత్కరించి ఆశీర్వచనాలు అందించారు. ఆయన వెంట డేటా ఎంట్రీ ఆపరేటర్ అనిల్ శాస్త్రి ఉన్నారు.

యువ కాపునాడు రాష్ట్ర జనరల్ సెక్రటరీగా రామకృష్ణ

విశాలాంధ్ర - నకరికల్లు : యువ కాపునాడు రాష్ట్ర జనరల్ సెక్రటరీగా పానుగంటి రామకృష్ణ శుక్రవారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ తనకు ఈ బాధ్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షులు గాళ్ళ సుబ్రమణ్యం, రాష్ట్ర అధ్యక్షులు మిద్దింటి కిషోర్‌లకు ధన్యవాదాలు తెలిపారు. తనపై ఉంచిన బాధ్యతలను విజయవంతంగా నిర్వహిస్తానన్నారు. రాష్ట్రంలో కాపు జాతికి న్యాయం చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణకు పలువురు శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పుల్లంశెట్టి భానుప్రకాష్, బండి వర్ధన్‌కుమార్, బెల్లంకొండ చినబాబు, మొకరాల వెంకటేశ్వర్లు, పుల్లంశెట్టి అంజి నాయుడు, మహేష్, కాసా రామకృష్ణ, బత్తిని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆటలమ్మపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-నూజెండ్ల: మండలంలోని ములకలూరు ఆయుష్ గ్రామంలో శుక్రవారం ఎంపీపీఎస్ మెయిన్ స్కూల్ నందు చికెన్ పాక్స్(ఆటలమ్మ) పైన అవగాహన కార్యక్రమాన్ని, వైద్య శిబిరాన్ని ఆయుష్ వైద్యులు ఆర్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చికెన్ పాక్స్(వారిసెల్ల) అనే వ్యాధి వారిసెల్లా జోస్టర్ వైరస్ ద్వారా వ్యాపిస్తుందని తెలిపారు. తలనొప్పి జ్వరం, దురద, గులాబీ రంగు బొబ్బల వంటి రాష్‌లు ఈ వ్యాధి లక్షణాలన్నారు. అజాగ్రత్త వహిస్తే చర్మం పై సూక్ష్మ క్రిముల ద్వారా అంటువ్యాధి, న్యుమోనియా, మెదడు వాపు వంటి ప్రమాదకరమైన సమస్యలకి ఈ వ్యాధి కారణమయ్యే అవకాశం ఉంది. ఆటలమ్మ వ్యాధి పిల్లలు ఆడుకునే వయసులో వస్తుంది కావున దాన్ని ఆటలమ్మని అంటారు. విద్యార్థిని, విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి వ్యాధి నిరోధక శక్తిని పెంచడానికి ఆయుష్ మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రమేష్ ప్రధానోపాధ్యాయులు, రవి టీచర్, వెంకట చారీ యోగా టీచర్, రాజశేఖర్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు నులిపురుగులు మాత్రలు వేయించాలి

విశాలాంధ్ర-శావల్యాపురం: చిన్నారులకు నులిపురుగుల మాత్రలను వేయడం వల్ల ప్రాథమిక దశలోనే నివారించవచ్చని, వారికి వ్యాధి నిరోధక శక్తి పెరిగి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని డిఎంహెచ్ఓ శోభారాణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 14వ తేదిన నిర్వహించనున్న నులిపురుగుల నివారణ కార్యక్రమంపై సమీక్షా సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలు, అంగన్వాడీ కేంద్రాలలో సంవత్సరం పిల్లల నుంచి 19 సంవత్సరాల్లోపు వారికి ఆల్బెండజోల్ మాత్రలను మింగించే కార్యక్రమాన్ని ఈనెల 14వ తేదిన నిర్వహించనున్నామని తెలిపారు. నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని అన్ని యాజమాన్య పాఠశాలల్లో కూడా నిర్వహిస్తామన్నారు. మండలంలోని 11 గ్రామ సచివాలయాల పరిధిలో 6347 మంది గుర్తించడం జరిగిందని, వీరందరికి ఆల్బెండజోల్ 400 మి.గ్రా. మాత్రను అందజేయాలని తెలిపారు. ఒకటి నుండి రెండు సంవత్సరాల పిల్లలకు సగం మాత్రను నీటిలో కలిగించి వేయాలన్నారు. 3 నుండి 19 సంవత్సరాల పిల్లలకు ఒక టాబ్లెట్ నమిలి మింగిచి నీరు తాగించాలన్నారు. నులిపురుగుల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈసమావేశంలో ఎంపిడివో పేరుమీన శీతారామయ్య, ఎంఈఓ మద్దికుంట సాంబశివరావు, వైద్యాధికారి డాక్టర్ సయ్యిద్ ఇబ్రహీం, జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలు అమలు జరిగేలా కృషి చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర-నరసరావుపేట: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను తప్పనిసరిగా సంబంధిత శాఖల అధికారులు అమలు జరిగేలా చూడాలని కలెక్టర్ శివ శంకర్ లోతేటి ఆదేశిం చారు. గత వారంలో స్పెషల్ ఆఫీసర్లు గ్రామ సచివాలయంలో ఆఖస్మిక తనిఖీ చేయమన్న విష యాన్ని గుర్తు చేసి శుక్రవారం సాయంత్రం ఎస్.ఆర్.శంకరన్ వీడియో కాన్ఫరెన్సు హాలు నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా అధికారులతో సమీక్ష నిర్వ హించారు. తనిఖీల్లో ముఖ ఆధారిత హాజరు వంద శాతం అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. స్పందనకు వచ్చే సమస్యలను సచివాలయాలలోని రికార్డులలో తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. సచివాలయ ఉద్యోగులు క్షేత్ర స్థాయి పర్యటనకు వెళ్లే ముందు సచివాలయం బయట ఏర్పాటు చేసిన నోటీసు బోర్డులో ఆ వివరాలను నమోదు చేయాలన్నారు. మార్చి 14న జిల్లా వ్యాప్తంగా నిర్వహించే నులి పురుగుల నిర్మూలన కార్యక్రమానికి సంబంధించి ప్రతీ ప్రైవేటు స్కూల్స్‌లో నులిపురుగుల మాత్రలు వేయించే విషయంలో మున్సిపల్ అధికారులు, మండల పరిషత్తు అభివృద్ధి అధికారులు, మెడికల్ ఆఫీసర్లు ఒక కమిటిగా ఏర్పాటై సచివాలయ ఉద్యోగులను ఒక్కో స్కూల్‌కు పంపి పిల్లలందరితో నులిపురుగుల మాత్రలు వేయించాలన్నారు. “మిషన్ శోభ కృత్ “ కార్యక్రమాన్ని జిల్లా అధికారులంతా తప్పని సరిగా విజయ వంతం చేయాలని కలెక్టర్ అధికా రులను ఆదేశించారు. ఈ సమావేశంలో డి.ఆర్.ఓ వినా యకం, ఆర్.డి.ఓ.లు, స్పెషల్ ఆఫీసర్స్, మండల తాహ శీల్దార్లు, మండల పరిషత్ అధికారులు, మెడికల్ అధికా రులు, పంచాయితీ రాజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు దారుణం : ప్రత్తిపాటి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: వ్యవసాయ పొలాల పంపుసెట్లకు మీటర్లు బిగించడం దారుణమైన చర్య అని, రైతు కంట కన్నీరు మంచిది కాదని రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. శుక్రవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ వేలకోట్లు జగన్మోహన్ రెడ్డి జేబులో వేసుకోవడం కోసమే వ్యవసాయ పొలాలకు మీటర్లు బిగించడం అంటూ రైతులని మోసం చేస్తున్నారని ఆరోపిం చారు. జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన దగ్గరనుంచి రైతులకు ఉపయోగపడే పని ఏదన్నా ఒకటి చేశారా..అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇసుక ఇతర మైనింగ్ వ్యవహారాల్లో ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు చెల్లించకుండా ముఖ్యమంత్రి, అధికార పార్టీ శాసనసభ్యులు మంత్రుల కనుసనల్లో ప్రైవేట్ ఆర్మీని ఏర్పాటు చేసు కొని యథేచ్ఛగా అక్రమ రవాణా చేస్తున్నారని విమర్శించారు. నిజాయితీగా వ్యాపారం చేస్తూ బిల్లులతో వెళుతున్న మైనింగ్ బళ్లను బోర్డర్లో ఆపేస్తున్నారని, బిల్లులు లేని లారీలను పంపించి వేస్తున్నారని, మైనింగ్ శాఖ కూడా అక్రమాలకు అడ్డాగా మారిందని ఆరోపించారు. పట్టభద్రుల ఎన్నికలలో గెలవలేమని దురుద్దే శంతోనే ఓటర్ల లిస్టులో అవకతవకలకు పాల్పడుతున్నారని, ఈ ఎమ్మెల్సీ ఎన్ని కల్లో జరుగుతున్న అక్రమాలపై సెంట్రల్ ఎలక్షన్ కమిషన్ వారు చర్యలు తీసుకో కపోతే ఎన్నికల కమిషన్‌పై కూడా ప్రజలకు నమ్మకం పోతుందని తెలిపారు.

వైభవంగా వీరాంజనేయ స్వామి వార్షికోత్సవం

విశాలాంధ్ర-రొంపిచర్ల: మండలంలో మర్రిచెటట్టుపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ వీరాంజనేయస్వామి వారి ఆలయ 42వ వార్షికోత్సవ తిరునాళ్ళ మహోత్సవం ఆదివారం జరుగుతుందని ఆలయకమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. మండలంలో విప్పర్ల, వి.రెడ్డిపాలెం, మర్రిచెటట్టుపాలెం, బెహరావారిపాలెం గ్రామస్తులు సహకారంతో తిరునాళ్ళ మహోత్సవం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా, అందంగా అలంకరించి పూజలు నిర్వహించటం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

ఎస్‌డీజీ సర్వే వేగవంతం చేయాలి

విశాలాంధ్ర-దుర్గి: ఎస్‌డిజీ సర్వే వేగవంతం చేయాలని మండల స్పెషలాఫీసర్ కె.సంజీవరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసమావేశములో మండల పంచాయతీల అధికారి జీ.ఎల్ఎన్ గుప్తా మాట్లాడుతూ ఈనెల 30కల్లా నూరుశాతం ఇంటి పన్ను వసూలు చేయాలని కోరారు. అటెండెన్స్ వంద శాతం వుండాలని, ప్రతిరోజు 3నుంచి5 వరకు జరిగే స్పందన కార్యక్రమంలో పాల్గోన్నాలన్నారు. తదితర అంశముల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో వెలుగొండారెడ్డి, చినవెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు, డీఎలు, డబ్ల్యూ ఎలు, మండల టీమ్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పశు విజ్ఞాన బడి రైతులకు ఎంతగానో ఉపయోగం

విశాలాంధ్ర-ఈపూరు: పశు విజ్ఞానబడి రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని, వ్యవసాయ పనులకే కాకుండా పాడి సంపదపై అవగాహన కలిగించేందుకు కృషి చేస్తున్నాయని ఈపూరు సహాయ సంచాలకులు పయ్యావుల శ్రీనివాసమూర్తి అన్నారు. మండలంలోని ఇనిమెళ్ళ గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువిజ్ఞానబడి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖ శాఖ పథకాలపై అవగాహన పెంచుకోవాలని పశువుల్లో సకాలంలో ఎదను గుర్తించడం ద్వారా సంవత్సరానికి ఒక దూడను పొందే విధంగా రైతులు జాగ్రత్తలు తీసుకొని పశు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి పశువైద్య సహాయకుల సహకారంతో ప్రతి వ్యాధికి టీకాలు వేయించుకుంటూ పశుపోషణ రంగంలో ముందుకు వెళ్లాలని సూచించారు. అదేవిధంగా వినుకొండ పశు వైద్య హాస్పిటల్ వద్ద ఉన్న ప్రయోగశాలలో అన్ని రకాల రక్త పరీక్షలు, పేడ పరీక్షలు చేయడం జరుగుతుంది. వాటిని వినియోగించుకోవాలని అలాగే సంచార పశు వైద్యశాల సేవలను 1962 నంబర్‌కు ఫోన్ చేసి అత్యవసర సమయాల్లో వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముప్పాళ్ళ పశు వైద్యాధికారిణి ఎం సునీత వైద్యశాల సిబ్బంది రైతులు గ్రామ సర్పంచి తదితరులు పాల్గొన్నారు.

ఆజాద్ ఫౌండేషన్, పల్నాడు మీడియా అసోసియేషన్ సేవలు అభినందనీయం: సీపీఐ

విశాలాంధ్ర-నరసరావపేట: పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో ఆజాద్ ఫౌండేషన్, పల్నాడు మీడియా అసోసియేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవలు అభినందనీయమని సిపిఐ పట్టణ కార్యదర్శి వైదన వెంకట్ అన్నారు. స్థానిక బ్లైండ్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు ఆజాద్ ఫౌండేషన్, పల్నాడు మీడియాసోసేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పేస్టులు, బ్రష్‌లు, టంగ్ క్లీనర్లు, షాంపూ ప్యాకెట్లు, పెన్నులు, బిస్కెట్ ప్యాకెట్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైదన వెంకట్ మాట్లాడుతూ ఇటీవల సిపిఐ పార్టీ నాయకులు బ్లైండ్ స్కూల్ ను సందర్శించి విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను పత్రికల దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. విషయం తెలుసుకున్న ఆజాద్ ఫౌండేషన్, పల్నాడు మీడియా అసోసియేషన్ నాయకులు బ్లైండ్ స్కూల్ విద్యార్థులకు అవసరమైన వస్తువులను అందజేయటం అభినందనీయం అన్నారు. ఆజాద్ ఫౌండేషన్ చైర్మన్ నాగేశ్వరావు మాట్లాడుతూ ముందుగా సిపిఐ పార్టీ వారికి ధన్యవాదాలు తెలుపుతూ సిపిఐ పార్టీ పేదల పార్టీ సమస్య ఎక్కడ ఉంటే అక్కడ సిపిఐ పార్టీ ఉంటుంది. బ్లైండ్ స్కూల్ పడుతున్న ఇబ్బందులు తమ దృష్టికి తీసుకువచ్చారు వెంటనే మేము స్పందించి మాకు తోచిన సహాయం చేయడం జరిగింది. మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎక్కడైనా అనాధలు ఇబ్బందులు పడుతున్న వారు తమ దృష్టికి తీసుకువస్తే మా ఆజాద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సహాయం చేస్తాం అన్నారు. మీడియా అసోసియేషన్ ప్రెసిడెంట్ అనిల్, అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు అర్రురి రమేష్, జర్నలిస్టులు మల్లికార్జున, నాగూరు, వెంకయ్య, మౌలాలి, నాగరాజు, పల్నాడు జిల్లా మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

అచ్చంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

విశాలాంధ్ర-పెదకూరపాడు రూరల్ : నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులు అందుబాటులో ఉండటం లేదని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవినీతి రాజ్యమేలుతోందని, రక్త పరీక్షలు సరిగా చేయడం లేదని ఆరోపణలు రావడంతో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎమ్మెల్యే తనిఖీ చేసిన సమయంలో డాక్టర్లు అందుబాటులో లేకపోవడం, ఓపీ తక్కువగా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న చిరుద్యోగి... డాక్టర్లు, సిబ్బంది చేసే అన్ని పాత్రలు తానే పోషిస్తున్నాడని ఆరోపణలు వెల్లువెత్తాయి. ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసే మందులను తన సొంత మెడికల్ షాపు ద్వారా విక్రయిస్తున్నాడని కూడా ఆరోపణలు వచ్చాయి. అవినీతికి పాల్పడుతూ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిపై శాఖాపరమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి తెలియజేశారు. ఉన్న సిబ్బందితో మాట్లాడి పేద రోగుల పట్ల మానవత్వంతో కూడా వైద్య సేవలు అందించాలని సూచించారు.

ఆరోగ్యాంధ్రప్రదేశే లక్ష్యం...

విశాలాంధ్ర-కారంపూడి: ఆరోగ్యాంధ్ర ప్రదేశ్ సాధనే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఏపి ఫుడ్ కమిషన్ చైర్మన్ సిహెచ్ విజయ ప్రతాపరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని చింతపల్లి గ్రామ అంగన్‌వాడి కేంద్రాన్ని , కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పేద వర్గాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ఆహార సంక్షేమ పథకాలు సక్రమంగా అందేవిధంగా చర్యలు తీసుకునేందుకు తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రం, కేజీబివిలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు తనిఖీ చేశామన్నారు. అంగన్‌వాడి కేంద్రం టీచర్ అందుబాటులో లేదని, తనపై చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేశామన్నారు. జిల్లా సివిల్ సప్లయ్ అధికారి జి మోహన్‌బాబు, డిటిడబ్లువో వరలక్ష్మీ, జిసిడివో రేవతి, తహశీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామ సచివాలయం ఉద్యోగిపై దాడి

విశాలాంధ్ర-శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామ సచివాలయ ఉద్యోగి ముట్లూరి మణిరత్నంపై దాడి చేసిన ఇరువురి వ్యక్తులపై కేసు నమోదు చేశామని ఎస్సై గల్లా రవికృష్ణ శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం గ్రామ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న డిజిటల్ అసిస్టెంట్ మణిరత్నం వద్దకు గురువారం సాయంత్రం పోట్లురు గ్రామానికి చెందిన గాలి వెంకటేశ్వర్లు, గాలి శ్రీనివాసరావు సర్వే కాయితాలు తీసుకువచ్చి వాటిపై మాట్లాడుతుండగా గొడవ జరిగి కులం పేరుతో దూషించి, చేయి చేసుకున్నారని డిజిటల్ అసిస్టెంట్ ఫిర్యాదు చేశారని తెలిపారు. బాధితుని పిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

యువత నాటకరంగంలో అడుగుపెట్టాలి

విశాలాంధ్ర-గుంటూరు : 'కళను బతికించడం కోసం యువత ముందుకు రావాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న), ప్రఖ్యాత నాటక రచయిత, ఆంధ్రప్రదేశ్ సృజనాత్మక సంస్కృతి సమితి విశ్రాంత ముఖ్య కార్యనిర్వహణాధికారి డాక్టర్ దీర్ఘాసి విజయ భాస్కర్ అన్నారు. గుంటూరు కళాపరిషత్ రజతోత్సవ ప్రత్యేక సంచిక 'దర్పణం' ఆవిష్కరణ మహోత్సవం గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శుక్రవారం ఘనంగా జరిగింది. గుంటూరు కళాపరిషత్ ఉపాధ్యక్షులు పీవీ మల్లిఖార్జునరావు అధ్యక్షతన జరిగిన సభలో ఈ పుస్తకాన్ని నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న) ఆవిష్క రించి మాట్లాడుతూ కళను బతికించడంలోనూ... ఆదరించడంలోనూ... కళాపరిషత్ కృషిని కొనియాడారు. డాక్టర్ దీర్ఘాసి విజయభాస్కర్ మాట్లాడుతూ కళను బతికించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ముఖ్యంగా యువత నాటక రంగంలోకి రావాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు. తద్వారా కళను బతికించుకునే అవకాశాలు ఉంటాయని అన్నారు. ఇతర రాష్ట్రాలల్లోని ప్రభుత్వాలు నాటక రంగాన్ని ఆదరిస్తున్నాయని, అదేవిధంగా మన రాష్ట్రంలో కూడా నటక రంగాన్ని ప్రభుత్వం ఆదరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రముఖ సాహితీవేత్త, హిందూ కళాశాల తెలుగుశాఖాధిపతి డాక్టర్ యల్లాప్రగడ మల్లిఖార్జునరావు మాట్లాడుతూ సంపాదకులు వల్లూరు శివప్రసాద్ దర్పణం పుస్తకాన్ని అద్భుతంగా రూపొందించారని, ఇది భవిష్యత్‌కు దిక్సూచీగా ఉపయోగపడుతుందని అన్నారు. దర్పణం సంపాదకులు వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ కళా రంగంలో 26 ఏళ్ళ గుంటూరు కళాపరిషత్ కృషిని కొనియాడారు. అనంతరం నస్రీన్ ఇషాక్ దర్శకత్వం వహించిన డాక్టర్ రావూరి భరద్వాజ 'పాకుడురాళ్ళు' నాటక ప్రదర్శన ఆహుతులను ఆలోచింపచేసింది. ఈ కార్యక్రమంలో గుంటూరు కళాపరిషత్ ప్రధాన కార్యదర్శి బి.పూర్ణ, గౌరవాధ్యక్షులు ఆలోకం పెద్దబ్బయ్య, అధ్యక్షులు వల్లూరు తాండవ కృష్ణ, ఉపాధ్యక్షులు నాయుడు గోపి, కార్యదర్శి గుమ్మడి నాగేశ్వరరావు, సభ్యులు అమ్మిశెట్టి శివ పాల్గొన్నారు.

సీపీఐ నేత నరిశేటి గురవయ్య వర్ధంతి

విశాలాంధ్ర-సత్తెనపల్లి: దివంగత సిపిఐ నేత, ధూళిపాళ్ళ ఆంధ్రాభ్యాంక్ రైతు సహకారసంఘం అధ్యక్షుడు నరిశేటి గురవయ్య 5వ వర్ధంతి సత్తెనపల్లి లెనిని నగర్‌లోని నరిశేటి గురవయ్య పార్క్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నరిశేటి గురవయ్య విగ్రహనికి గురవయ్య కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణులు, పలు రాజ కీయ పార్టీల, ప్రజాసంఘాల నేతలు, లెనిన్ నగర్ వాసులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పిచారు. వివాదరహితుడు, మృదుస్వభావి నరిశేటి గురవయ్య తుదిశ్వాస వరకు తను నమ్మిన కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పేదప్రజల కోసం పనిచేశారు.

ఎస్టీయూ, రైతు సంఘం, సీపీఐలో పలు కీలకపదవులు నిర్వహించడంతో పాటు సత్తెనపల్లి 2వవార్డు మున్సిపల్ కౌన్సిలర్‌గా, గుంటూరు జిల్లా పరిషత్ ప్రణాళికా సంఘం సభ్యులుగా, ధూళిపాళ్ళ ఆంధ్రాభ్యాంక్ రైతు సహకార సంఘం అధ్యక్షుడుగా సేవలందించిన నరిశేటి గురవయ్య చిరస్మరణీయులని ఈ సందర్భంగా పలువురు మననం చేసుకోన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యుడు నరిశేటి వేణుగోపాల్, సత్తెనపల్లి నియోజకవర్గ కార్యదర్శి పి.యిర్మీయా, నరిశేటి తాండవ క్రిష్ణ, ఏఐటీయూసీ సత్తెనపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు, కంబాల శ్రీనివాస్, సత్తెనపల్లి బార్ అసోషియేషన్ అధ్యక్షుడు మారూరి లింగారెడ్డి, బిజెపి సత్తెనపల్లి పట్టణ అధ్యక్షుడు దివ్వెల శ్రీనివాస్, బీఎస్పీ నేత బోక్కా సంగీతరావు, న్యాయవాదులు, బి.యల్. చిన్నయ్య, పూజల వెంకట కోటయ్య, గంగూరి అజయ్ కుమార్, విశ్రాంత లెక్చరర్ శేషయ్య, టిడిపి నాయకులు గన్నమనేని శ్రీనివాస్, పోట్ల ఆంజనేయులు, మెక్కపాటి సుధాకర్, కోడాలి ఆనంద్, ఎఐటియుసి నాయకులు ఇ.అంజిరెడ్డి, కట్టాశంకర్రావు, సర్వేయర్ మధు, వెన్నా నాగిరెడ్డి, రాసయ్య, చిరంజీవి, సుభాని, అంచా చిన్నా, విజయ్, కంబాల ఆనంద్, సుధాకర్, ఆర్.యం.పి. సత్యనారాయణ, లెనిన్ నగర్ సిపిఐ శాఖ నేతలు, మన్నెం నరశింహారావు, జంపని నరశింహరావు, అందే బాలకోటేశ్వరావు, సత్యనారాయణ, సాంబ, పాతూరి స్వామి, కొరారి వంశీ, సుగుణమ్మ, విమల, సుభాషిణి, సునీత, శ్రావణీ, జయక్రిష్ణ నివాళులర్పించారు.

టీడీపీ ఆధ్వర్యంలో అన్నదానం

సీపీఐ నేత నరిశేటి గురవయ్య 5వ వర్ధంతి సందర్భంగా టీడీపీ యువనేత మన్నెం శివనాగమల్లేశ్వరావు(మల్లీ) ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద అన్నదానం నిర్వహించారు. రైల్వేస్టేషన్ వద్ద హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్, ఆర్టీసీ బస్టాండ్ వద్ద అన్నా క్యాంటీన్‌లో, మాతృశ్రీ మల్లమాంబ వృద్ధాశ్రమంలో పేదలు, వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి, చౌట శ్రీనివాస్, డాక్టర్ పవన్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి వక్కంటి అజయ్, టిడిపి సత్తెనపల్లి పట్టణ అధ్యక్షుడు కటకం రామక్రిష్ణ, టిడిపి జిల్లా కార్యదర్శి, బత్తుల చంద్రశేఖర్, మాజీ కౌన్సిలర్స్, మార్కెట్ రాజు, పోట్ల ఆంజనేయులు, మాజీ ఎంపిటిసి, పచ్చా సుధీర్, లోకేశ్వరావు, సిపిఐ సత్తెనపల్లి నియోజకవర్గ కార్యదర్శి పి.ఇర్మియా, ఏఐటీ యూసీ సత్తెనపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్, కట్టా శంకర్రావు అమరావతి జేఏసీ సత్తెనపల్లి పట్టణ కన్వీనర్ గన్నమనేని శ్రీనివాసరావు, ఏఐఎస్ఎఫ్ నాయకుడు కంబాల భీమేశ్వరరావు, ఆశ్రమ నిర్వాహకులు కొండలు తదితరులు పాల్గొన్నారు.

రేపు మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

విశాలాంధ్ర-చిలకలూరిపేట: స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచినప్పటికీ మహిళల పట్ల వివక్ష, అసమానతలు, దాడులు కొనసాగుతున్నాయని, వివిధ రంగాల్లో పని చేస్తున్న మహిళలకు కనీస వేతనాలు, కార్మిక చట్టాలు అమలు కావడం లేదని, మహిళలు శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఏపీ మహిళా సమాఖ్య ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షురాలు నాగబైరు రామసుబ్బాయమ్మ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 12 తేదీ ఆదివారం మధ్యాహ్నం 2గంటలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి పి.దుర్గా భవాని, నరసరావుపేటకు చెందిన ప్రముఖ వైద్యురాలు డాక్టర్ సి.గౌతమి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కందిమళ్ల జయమ్మ, సహాయ మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ పీవీ నాగలక్ష్మి, పల్నాడు జిల్లా సీపీఐ కార్యదర్శి ఎ.మారుతీ వరప్రసాద్ పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ వర్ధమాన గాయని బెల్లంకొండ భారతి, సహాయ మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ పీవీ నాగలక్ష్మిలను ఘనంగా సన్మానించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అన్ని రంగాలకు చెందిన మహిళలు, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల, పట్టణ కార్యదర్శి బి లలితకుమారి పాల్గొన్నారు.

తిరునాళ్ళకు ఆర్టీసీ ఆదాయం రూ.5లక్షలు

విశాలాంధ్ర-మాచర్ల: ఈనెల 7వ తేదీ నుండి మూడు రోజులు పాటు జరిగిన సాగర్ మాత తిరునాళ్లకు ఆర్టీసీ ఆదాయం రు.5,06,498 లు వచ్చినట్లు డిపో మేనేజర్ ఆర్ పిచ్చయ్య శుక్రవారం తెలిపారు. మేనేజర్ పిచ్చయ్య మాట్లాడుతూ గత సంవత్సరం ఉత్సవాలకు కేటాయించిన టికెట్ల ధరలనే ఈ సంవత్సరం కూడా కొనసాగించటం జరిగిందన్నారు. అయితే గత ఏడాది కంటే రు.11,531లు ఈ సంవత్సరం ఆదాయం అదనంగా వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. తిరునాళ్లకు సహకరించిన చర్చి యాజమాన్యం, పోలీసులకు ఆర్టీసీ తరపున ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

తాగునీటి నిర్వహణలో వాటర్ ఎయిర్ ఇండియా శిక్షణ తరగతులు

విశాలాంధ్ర-వెల్దుర్తి: త్రాగునీటి నిర్వహణలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకొని నీటిని ఆదా చేయాలో వాటర్ ఎయిడ్ సంస్థ తమ ప్రతినిధులకు శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఎయిర్ ఇండియా ప్రతినిధి ఐఎస్ మాడబోయిన గురు ప్రసాద్ మాట్లాడుతూ సమగ్ర నీటి పరీక్షలు, యాజమాన్య పద్ధతులపై ప్రతినిధులకు అవగాహన కల్పించారు. అలాగే సంస్థ ఇంజనీర్ పవన్ కుమార్ మాట్లాడుతూ వాటర్ ట్యాంకులు పైపులైన్ల వాడకంపై ఆధునిక పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో సిఎఫ్‌లు రాజశ్రీ, రవి వర్మ, లక్ష్మణరావు వెల్దుర్తి మాచర్ల మండలాల సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

తిరునాళ్ళ ప్రత్యేకాధికారిగా సత్యనారాయణ రెడ్డి

విశాలాంధ్ర-దుర్గి: ఈనెల 12వ తేదీన జరుగుతున్న శ్రీనిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి తిరునాళ్ళ(జాతర) మహోత్సవమునకు దేవాదాయ ధర్మాదాయ శాఖా పల్నాడు జిల్లా అసిస్టెంట్ కమీషనర్ (ఏసి) సత్యనారాయణ రెడ్డి తిరునాళ్ళ ప్రత్యేకాధికారిగా దేవాదాయ శాఖ నియమించినట్లు ఆలయ కార్య నిర్వాహణాధికారి శ్రీగిరిరాజు నరసింహబాబు శుక్రవారం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: గణపవరం జాతీయ రహదారి ఎం.ఎల్ కంపెనీ ఎదురు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందాడు. గణపవరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్‌గా పనిచేస్తున్న ఆమెకు ఓకే ఒక్క కుమారుడు అయిన పార్దు మహేంద్ర (17) సిద్ధార్థ డిఫెన్స్ అకాడమీ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. కళా శాలకు వెళుతున్న విద్యార్థి మహేంద్రపై బస్సు టైర్ ఎక్కటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నాదెండ్ల పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదుపుతప్పి ఆటో బోల్తా

విశాలాంధ్ర-విజయపురిసౌత్: నాగార్జున సాగర్, విజయపురిసౌత్ నుంచి అతి వేగంగా మాచర్ల వైపు వెళ్తున్న ఆటో చింతల తండా వద్ద బోల్తా పడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరల్లోకి వెలితే విజయపురిసౌత్ నుంచి ప్రయాణికులతో ఆటో మాచర్ల కు బయలుదేరింది. అతి వేగంగా వెళ్తుండగా ఆటో సరిగ్గా చింతలతండా వద్దకు రాగానే ఒక్కసారి అదుపు తప్పి బోల్తా పడింది. దీనితో ఆటలో ప్రయాణిస్తున్న ఆత్మకూరు గ్రామానికి చెందిన జ్ఞానయ్య కు తీవ్ర గాయాలు అయ్యాయి. మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన జ్ఞానయ్యను మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఎస్ఐ పి.అనిల్ కుమార్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

రీ సర్వేపై సమీక్ష

విశాలాంధ్ర-యడ్లపాడు: మండలంలో జరుగుతున్న భూరీ సర్వేపై పల్నాడు జిల్లా డిప్యూటీ కలెక్టర్ వసంత బాబు శుక్రవారం సమీక్షించారు. మండల తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన సమీక్షలో ప్రధానంగా తుర్లపాడు, మైదవోలు రెవిన్యూ గ్రామాల పరిధిలోని రీసర్వే ప్రక్రియపై ఆరా తీశారు. భూ యజమానులకు నోటీసులు జారీ చేశారా లేదా అని ప్రశ్నించారు. రీసర్వే ప్రక్రియ పారదర్శకంగా ఉండాలన్నారు. తప్పులు దొర్లకుండా జాగ్రత్త వహించాలని సూచించారు.

మహారాజశ్రీ గురజాల సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఐ.పి.నెం .1/2017

బిట్వీన్ :
వేముల శ్రీను - పిటిషనర్
మరియు
1. దోసపాటి పూర్ణ మరియు 9 మంది యితరులు - రెస్పాండెంట్స్
టు,
ఆర్9 : టి. మధు తండ్రి సత్యం పత్తిమిల్లు మరియు సాయిబాబ గుడి వద్ద, మాచర్ల, మాచర్ల మండలం, పల్నాడు జిల్లా.

పై కోర్టులో మీపై పిటిషనరు ఐ.పీ.దాఖలు చేసి యున్నాడు. దీనిలో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ తీసికొనక కాలయాపన చేయుచున్నందున శ్రీకోర్టు వారిపై ఐ.పీ.లో మీకు గల అక్షేపణలు తెలుపుకొనుటకు ది.15-03-2023 ఉదయం 10.30గం॥లకు పై కోర్టులో తీర్మానించబడునని యిందుమూలముగా తెలియజేయడమైనది.

వాయిదా తేది : 15-03-2023

దుగ్గరాజు అనంతరామయ్య
పిటిషనరు తరపు అడ్వకేట్, గురజాల
సెల్ : 7671054310

వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

విశాలాంధ్ర-అద్దంకి : వైసీపీ బలపరచిన ఎమ్మెల్సీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓట్లువేసి గెలిపించాలని శాప్‌నెట్ చైర్మన్ నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. శుక్రవారం అద్దంకి పట్టణంలో పలు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, కార్యాలయాలలో పనిచేస్తున్న గ్రాడ్యుయేట్ ఓటర్లను కలసి ఉమ్మడి ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు పట్టభద్రుల వైసీపీ బలపరచిన ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, అలాగే ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డిలకు ఈనెల 13న జరగబోయే ఎన్నికల గురించి వివరించి మద్దతు తెలిపి మొదటి ప్రాధాన్యత ఓట్లు వేసి అత్యంత మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

14న నులిపురుగు మాత్రల పంపిణీ

విశాలాంధ్ర - యద్దనపూడి : ఈనెల 14వ తేదీన మండలంలో జరిగే నులిపురుగుల మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారులు సుభాషిని, వీరబ్రహ్మం అన్నారు. మండలంలో అన్ని గ్రామాలకు పంపిణీ చేయడానికి సిబ్బందికి మాత్రలు అందజేశారు. ఒక సంవత్సరం నుండి 19 ఏళ్ల వయసు వారికి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని అన్ని ప్రభుత్వ ప్రయివేట్ విద్యాసంస్థలు, అంగన్వాడీ కేంద్రాల్లో చేయాలని సిబ్బందికి తెలిపారు. పిల్లల్లో నులిపురుగులు, రక్తహీనత నివారణకు ఈ మాత్రను తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. పిల్లలు తిన్న ఆహారం వంటపట్టేందుకు కూడా ఈ మాత్ర ఎంతగానో పనిచేస్తుందన్నారు. మధ్యాహ్నం భోజనం చేశాక ఒక మాత్రను వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిపి మస్తాన్, ప్రధానోపాధ్యాయులు పోతురాజు, సిహెచ్‌ఓ టీవీఎస్ ప్రసాద్, ఎం పి హెచ్ ఓ జయ కుమార్ సూపర్వైజర్లు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు

విశాలాంధ్ర - బల్లికురవ : ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం బల్లికురవ నాలుగు రోడ్ల కూడలిలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. అన్ని ప్రధాన రహదారులలో అనుమానిత వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డి సీతామహాలక్ష్మి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వాహనాలలో అక్రమ మద్యం,డబ్బు తరలిస్తే వారిపై చట్టమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో ఎవరైనా ఓటర్లకు డబ్బు,మద్యం పంపిణీ చేసిన ప్రలోభాలకు, భయభ్రాంతులకు గురిచేసిన వారిపై చర్యలు తప్పవన్నారు. ఈ తనిఖిలలో ఏఎస్ఐ బాలకృష్ణ ఉన్నారు.

నులిపురుగుల నివారణ.. విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - బల్లికురవ : జాతీయ నులిపురుగుల దినోత్సవ కార్యక్రమంలో భాగంగా ఈనెల 14న మండలంలో జరిగే నులిపురుగుల మాత్రల పంపిణీ కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి రమీజు సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిధిలోని అన్ని గ్రామాలకు ఆల్బెండజోల్ మాత్రలను స్కూల్ హెచ్‌ఎం, ఏఎన్‌ఎంలకు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ సుమారు 6000 ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు, సంవత్సరం నుండి 19 ఏళ్ల వయసు వారికి ఆల్బెండజోల్ మాత్రలను అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలు, అంగన్వాడీ కేంద్రాల్లో పంపిణీ చేయాలని అన్నారు. పిల్లల్లో నులిపురుగులు, రక్తహీనత నివారణకు ఈ మాత్రలు ఉపయోగపడతాయన్నారు. మధ్యాహ్నం భోజనం చేశాక ఒక మాత్రను వేసుకోవాలన్నారు. ఈవోపీఆర్డి సీతామహాలక్ష్మి,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భారత ఖోఖో జట్టుకు సీఈసీ విద్యార్థి

విశాలాంధ్ర - చీరాల : అస్సాంలో జరగనున్న ఆసియా ఖో ఖో టోర్నమెంటులో పాల్గొనే భారత జట్టుకు చీరాల ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి ఆట్ల శివనాగిరెడ్డి ఎంపికయ్యారు. ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్న శివనాగిరెడ్డి మార్చ్ 14నుంచి 18వరకు జరిగే శిక్షణ శిబిరంలో పాల్గొంటారు. 20 నుంచి 23వరకు టోర్నమెంట్ జరుగుతుంది. ఇండియా జట్టుకు ఎంపికైన శివ నాగిరెడ్డిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రవికుమార్, పిడి శ్రీనివాసరావు, కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

సావిత్రభాయి పూలేకు ఘన నివాళి



విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : భారత ప్రథమ ప్రధానోపాధ్యాయిని సావిత్రిబాయి పూలే వర్ధంతిని పురస్క రించుకుని బాపట్ల మండల కార్యాలయం ఆవరణంలోని పూలే దంపతుల విగ్రహాలకు బీటీఏ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీటీఏ రాష్ట్ర నాయకులు గడ్డం ఏలియా మాట్లాడుతూ సావిత్రిబాయి చదువుల తల్లి స్త్రీలకు,శూద్రులకు అంటరాని వారికి, బాలికలను విద్యకు దూరంగా ఉన్న వారి అందరినీ చేరదీసిన త్యాగశీలి అని కొనియాడారు. బహుజన సమాజ్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి కొచ్చర్ల వినాయరాజు మాట్లాడుతూ ఆర్తుల పట్ల, అనార్థులు, పేదలు, అణిచివేయబడ్డ వారిపై దయ చూపటం ఆమె సహజ గుణం అన్నారు. తమ ఇంట్లో చదువు కోసం వచ్చిన పిల్లలు తల్లిగా ఆమె వాత్సల్యం ప్రేమ పంచిందన్నారు. జీవితాంతం ప్రజల శ్రేయస్సు కోసమే జీవించిందని తెలిపారు. వితంతువులు, అనాథ పిల్లలని చేరదీసి ఉన్నత జీవితాన్ని చేరుకునేలా కృషి చేసిందని ఆమె సేవలను కొనియాడారు. న్యాయవాది కట్ట కొర్నెల్, దాసరి లక్ష్మి , గుంటూరు సురేష్, నత్తల ప్రసాద్, యశ్వంత్, సాయి ,చిన్న పాల్గొన్నారు.

కర్లపాలెం ఆర్‌ఐగా రాజేంద్ర ప్రసాద్

విశాలాంధ్ర - కర్లపాలెం : కర్లపాలెం రెవిన్యూ ఇన్స్‌పెక్టర్‌గా రాజేంద్రప్రసాద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయంలో టైపిస్ట్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతి రావటంతో ఎంపికయ్యారని తహసిల్దార్ కేశవనారాయణ తెలిపారు. తహసీల్దార్ కేశవ నారాయణ, వీఆర్‌ఓలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు రాజేంద్రప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - కర్లపాలెం : రెండవ శనివారం కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుండి 1 గంట వరకు విద్యుత్ కోత విధిస్తున్నట్లు విద్యుత్‌శాఖ అధికారి మల్లెల కుమార్ తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మత్తుల కారణంగా విద్యుత్ నిలుపుదల చేస్తున్నామని విద్యుత్ వినియోగదారులు అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

ఆర్థిక భరోసా కల్పిస్తున్న సీఎం జగన్‌ను ఆదరించాలి: కోన

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : సంక్షేమ పథకాల ద్వారా ప్రతి పేదవానికి ఆర్థిక భరోసా కల్పిస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను ప్రజలు ఆదరించాలని ఏపీ శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్, బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి కోరారు. శుక్రవారం మండలంలోని చందోలు గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లినప్పుడు ప్రతి ఒక్కరి మోహములో చిరునవ్వు కనిపిస్తుందన్నారు. ప్రజలందరూ వైఎస్ జగన్ ను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. పాదయాత్రలో ప్రజల కష్టసుఖాలను దగ్గరగా చూసిన వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే నవరత్నాలను ప్రవేశపెట్టి సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రతి ఇంటికి ఒక అన్న, తమ్ముడు, ఇంటి పెద్ద కొడుకులా, విద్యార్థుల పట్ల మామయ్య లా ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారని కొనియాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే సీఎం జగన్ ధ్యేయమన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని సీఎం జగన్ నూటికి నూరు శాతం నెరవేర్చారని చెప్పారు. కులం, మతం పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తు ఎక్కడా అవినీతికి తావు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలోనే నగదు జమ చేస్తూ పారదర్శకంగా నవరత్నాలను సచివాలయం వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటికి చేరువ చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ షేక్ బాజీ, వైస్ ఎంపీపీ రామరాజు, రాష్ట్ర రహదారుల డైరెక్టర్ అహ్మద్ హుస్సేన్, బాపట్ల ఏఎంసీ డైరెక్టర్ మండే విజయ్ కుమార్, జడ్పీటీసీ, ఎంపీటీసీలు, మండల వైఎస్సార్సీపీ నాయకులు ప్రకాష్, శివారెడ్డి, సర్పంచ్ గౌరీ దేవి విజయ కుమారి మునీర్, మండల తహశీల్దార్ సుధారాణి, ఎంపీడీవో పద్మజా, సర్పంచులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు

డిమాండ్లు పరిష్కరించాలని నల్లబ్యాడ్జీలతో నిరసన

విశాలాంధ్ర - బాపట్ల : ప్రభుత్వం కేటాయించిన మొత్తాన్ని కేటాయించకుండా తాత్సరం చేయటంపై ఏపి రెవిన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన చేపట్టారు. ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక విశ్రాంత కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల ఆర్థిక ఆర్థికేతర సమస్యల పరిష్కారానికి ఏపీ జేఏసీ అమరావతి ప్రకటించిన ఉద్యమ కార్యాచరణలో భాగంగా జేఏసి,ఏపి రెవిన్యూ ఉద్యోగుల సంఘం సంయుక్తంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ రెవెన్యూ అసోసియేన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ సి.హెచ్.సురేష్ బాబు, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా సహాధ్యక్షులైన బి.సుశీల మాట్లాడుతూ సీపీఎస్ రద్దుచేస్తామని ప్రకటించి ఇప్పటి వరకు ఎందుకు రద్దు చేయలేదని ప్రశ్నించారు. భద్రతగా ఉంటుందని ప్రభుత్వం దాచుకున్న డబ్బుల్ని కూడా మాకు ఇవ్వకుండా నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని ఆవేదన చెందారు. న్యాయమైన కోరికల పరిష్కారానికి మాత్రమే ఉద్యమం చేస్తున్నామని ప్రజాస్వామ్యంలో ఉద్యమం మన హక్కుని మనకు రావాల్సిన ఆర్థికపరమైన చెల్లింపులు సమస్యలు పూర్తిగా నెరవేర్చే వరకు ఈ ఉద్యమం ఆగదని ప్రతి ఒక్క ఉద్యోగి చిత్తశుద్ధితో ఉద్యమకారాచరణలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యాలయాల్లోకి వెళ్లి కరపత్రాలు నల్లబ్యాడ్జీలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రెవిన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి డి.అర్జున్, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షులు షేక్ మహబూబ్ బాషా, కలక్టరేట్ యూనిట్ సెక్రెటరీ ఏ.సుమంత్, కార్యవర్గ సభ్యులు ఎ.శివరామకృష్ణ, జి.సాయి, పి.శ్రీలక్ష్మి, డి.శ్రీనివాసరావు, ఎమ్.రాజిమ్మ, వివిధ డిపార్ట్మెంట్‌కి చెందిన నాయకులు పాల్గొన్నారు.

'చలో మచిలీపట్నం' విజయవంతం చేయండి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : జనసేన పార్టీ సభ్యత్వాల నమోదు కార్యక్రమంలో చురుకుగా పని చేసిన జనసైనికులను ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి నామన వెంకట శివన్నారాయణ, తులసి కుమారి, గోపాలం లక్ష్మీకళల చేతుల మీదుగా చిరు సత్కార కార్యక్రమాన్ని జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. శుక్రవారం చలో మచిలీపట్నం గోడప్రతులు ఆవిష్కరణ కార్యక్రమంలో భాగంగా జనసేన పార్టీ సభ్యత్వ నమోదు ఆరుమళ్ళ సుజిత్ అత్యధిక సంఖ్యలో చేయడం హర్షించదగిన విషయమని జనసైనికులు నామన వెంకట శివన్నారాయణ పేర్కొన్నారు. సుజిత్‌తో పాటు, కారుమూరు ఆంజనేష్, చిలకల సురేంద్ర, మణికంఠలను దుశాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి గుంటూరు జిల్లా సంయుక్త కార్యదర్శి తులసి కుమారి మాట్లాడుతూ జనసేన పార్టీ ఆవిర్భావించి పదేళ్లుపూర్తి చేసుకున్న సందర్భంగా 14వతేదీ చలో మచిలీపట్నం కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు జనసేన నాయకులు కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. అదేవిధంగా జనసైనికులు నామన వెంకట శివన్నారాయణ మాట్లాడుతూ జనసేన పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న జనసైనికులైన కార్యకర్తలు సభ్యత నమోదులో చురుగ్గా పాల్గొని పార్టీని బలోపేతం చేస్తున్న ప్రతి ఒక్కరిని కూడా సన్మానించాలని జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాలు మేరకు ప్రతి నియోజకవర్గంలో సభ్యత నమోదు పూర్తిచేసిన వారిని సన్మానిస్తున్నట్లు తెలియజేశారు. రాజకీయ చరిత్రలో పార్టీ చేయనటువంటి కార్యకర్తలు అండగా నిలిచే పార్టీ జనసేన పార్టీ అని తెలిపారు. ఏ పార్టీలో సభ్యత్వం కట్టిన ఇన్సూరెన్స్ ఇచ్చిన దాఖలాలు లేవని నేడు జనసైనికులకు చిన్న ప్రమాదం జరిగిన నేనున్నాను అని భరోసా ఇస్తున్నటువంటి జనసేన సభ్యత్వం ప్రతి ఒక్కరు చేసుకోవాలని మీ అందరికీ అండగా జనసేన పార్టీ ఉంటుందని భరోసా ఇచ్చారు. చలో మచిలీపట్నం కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే లక్ష్మి కళ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీతో సత్సంబంధాలు లేకపోతే జనసేన పార్టీ విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గోగుణ ఆదిశేషు, మణికంఠ, సుజిత్, సురేంద్ర, అంజినేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌తో వాహనచోదకుల అవస్థలు

విశాలాంధ్ర - భట్టిప్రోలు : భట్టిప్రోలు - చావలి ప్రధాన రహదారి మార్గంలో పాత కెఎస్ఆర్ కళాశాల వద్ద గల విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌తో వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వాహనాల రాకపోకలకు తీవ్ర అటంకంగా మారింది. ఈ రహదారి మార్గంలో అను నిత్యం ఆర్‌టిసి బస్సులు, లారీలు, టిప్పర్లు, ఆటోలు వందల సంఖ్యలో ప్రయాణిస్తుంటాయి. తెనాలి ఆర్‌టిసి డిపో బస్సులు తమ సర్వీసులను రేపల్లె వరకు పొడిగించడంతో బస్సుల రాకపోకలు పెరగడంతో ఈ మార్గం రద్దీగా మారింది. అసలే ఇరుకురోడ్డు దీనికి తోడు రోడ్డు మీద వరకు ట్రాన్స్ ఫార్మర్‌కు చుట్టూ కంచె వేసి ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు తప్పుకునేందుకు నానా కష్టాలు పడాల్సి వస్తోందని వాహన చోదకులు అంటున్నారు. వాహనాలు గంటల తరబడి నిలిచిపోతుండడంతో ట్రాఫిక్ స్థంబించి కనీసం నడిచి వెళ్లేందుకు కూడా అవకాశం లేకుండా పోతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని ట్రాన్స్ ఫార్మర్‌ను మరొక చోటికి తరలించి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

ఆక్వా రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

విశాలాంధ్ర - నిజాంపట్నం : ఆక్వా రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అడవులదీవి సర్పంచ్ శౌంతి శ్రీనివాసరావు అన్నారు. రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు ఆదేశాల మేరకు శుక్రవారం మండలం లోని అడవులదీవి గ్రామంలో ఎంపీఈడిఏ వారి ఆధ్వర్యంలో ఆక్వా సాగు విస్తరణ అభివృద్ధి, సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల పై ఆక్వా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సర్పంచ్ శౌంతి శ్రీనివాసరావు పాల్గొని మాట్లా డుతూ ఆక్వా రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక విధాలుగా కృషి చేస్తు ప్రోత్సాహం అందిస్తుందని దానిలో భాగంగా ఆక్వా రైతులు సాగుపై ఎలాంటి యాజమాన్య పద్ధతులు పాటించాలి, వ్యాధుల నిర్మూలనకు ముంద స్తు చర్యలు, నాణ్యమైన పిల్లల ఎంపికలు తదితర విషయాలపై అవగాహన కార్యక్ర మాలు నిర్వహిస్తున్నారని తెలిపారు.ఆక్వా సాగు రైతులు ప్రభుత్వ పథకాలు, విద్యుత్ రాయితీ లాంటివి పొందేందుకు వీలుగా ప్రభుత్వం అప్పుడా చట్టాన్ని తీసుకువచ్చిం దని తెలిపారు.గ్రామాల్లోని ప్రజలకు అందుబాటులో సరసమైన ధరల్లో నాణ్యమైన తాజా చేపలు, రొయ్యలు కొనుక్కునే వీలుగా ప్రభుత్వం ఫిష్ ఆంధ్ర డొమెస్టిక్ మార్కెట్లను ప్రారంభించిందని చెప్పారు.అనంతరం ఆక్వా రైతులకు నీటి నాణ్యత పరికరాల కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ ఎఫ్డిఓ పి.సాయి సందీప్, ఎంపీఈడిఏ ప్రతినిధులు, ఆక్వా శాస్త్రవేత్తలు, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

దీర్ఘకాలంగా పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి

- ఎస్పీ వకుల్‌జిందాల్

విశాలాంధ్ర - బాపట్ల : దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. ఎస్పీ క్యాంప్ కార్యాలయ సమావేశ మందిరంలో బాపట్ల సబ్ డివిజన్ పరిధిలోని బాపట్ల పట్టణ, కర్లపాలెం, మార్టూరు, చీరాల సబ్ డివిజన్ పరిధిలోని చీరాల 1టౌన్, వేటపాలెం, అద్దంకి, రేపల్లె సబ్ డివిజన్ పరిధిలోని రేపల్లె పట్టణ, నగరం, అమర్తలూరు పోలీస్ స్టేషన్‌ల ఎస్ఐలు, సీఐలు, డిఎస్పీలతో 2022 ఏడాది నుంచి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై సమీక్షించారు. ఎస్పీ మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెండింగ్‌లో వున్న కేసులలో వృత్తి నైపుణ్యతతో పాటు సాంకేతికత పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని దర్యాప్తు సాగించాలన్నారు. ముద్దాయిలను అరెస్ట్ చేసి వీలైనంత త్వరగా ఛార్జ్‌షీట్ దాఖలు చేయాలని అధికారులను ఆదేశించారు. కేసుల దర్యాప్తులో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.సైబర్ నేరాలకు సంబంధించిన పిర్యాదులు అందిన వెంటనే నేరస్తుని అకౌంట్‌లోని సొమ్ము మరో అకౌంట్‌లోకి బదిలీ కాకుండా నిలుపుదల చేసి బ్యాంక్ అధికారుల ఈ అకౌంట్‌కు సంబంధించిన వివరాలు తెలుసుకోవాలన్నారు. సైబర్ నేరాలలో విచారణ వేగవంతం పూర్తి చేస్తేనే బాధితులకు త్వరగా న్యాయం చేయగలమన్నారు.గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణాను పూర్తి స్థాయిలో అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి, డ్రగ్స్ విక్రయించే వారు ప్రధానంగా విద్యార్థులు, యువతను లక్ష్యంగా చేసుకొని వారి కార్యకలాపాలను సాగిస్తుంటారన్నారు. అదేవిధంగా క్వారీలలో, ఫ్యాక్టరీలలో పనిచేయడానికి ఇతర రాష్ట్రాల నుండి వచ్చే కార్మికులను కూడా లక్ష్యంగా చేసుకొని వారికి గంజాయి, ఇతర మత్తు పదార్థాలను విక్రయించే అవకాశం వుంటుందని అనుమానిత ప్రాంతాలలో తరచూ సోదాలు నిర్వహించాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న కళాశాలలో, పాఠశాలలో సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కలిగే విధంగా పోస్టర్స్ ఏర్పాటు చేసి డ్రగ్స్ వినియోగించడం వల్ల కలిగే అనర్థాలు గురించిన చిత్రాలను ప్రదర్శించి విద్యార్థులలో చైతన్యం తీసుకురావాలన్నారు. దీంతో జిల్లాలో పూర్తి స్థాయిలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాలను, అక్రమ రవాణాను అరకట్టేందుకు అవకాశం వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, బాపట్ల, చీరాల, రేపల్లే డీఎస్పీలు ఏ.శ్రీనివాసరావు, పి.శ్రీకాంత్, టి.మురళీకృష్ణ , డి.సి.ఆర్.బి సీఐ పి. బాలమురళీకృష్ణ , డి.ఎస్.బి సీఐ ఏ. శ్రీనివాస్, బాపట్ల పట్టణ సీఐ పి.కృష్ణయ్య, బాపట్ల రూరల్ సీఐ జీ.వేణుగోపాలరెడ్డి, మార్టూరు సర్కిల్ సీఐ షేక్.టి.ఫిరోజ్ , చీరాల 1 టౌన్ సీఐ వి.మల్లికార్జునరావు, చీరాల రూరల్ సీఐ ఏ.మల్లికార్జునరావు, అద్దంకి టౌన్ సీఐ ఏమ్.రోశయ్య, రేపల్లె పట్టణ సీఐ ఎస్.విజయచంద్ర, రేపల్లె రూరల్ సీఐ ఏ.శివశంకర్ తదితరులున్నారు.

అందరి దృష్టి ఎమ్మెల్సీ ఎన్నికలపైనే..

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : జిల్లాలో ఎంఎల్‌సి ఎన్నికల వాతావరణం వేడెక్కింది. తూర్పు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యా య ఎంఎల్‌సి ఎన్నికల్లో పట్టభద్రుల స్థానానికి 22 మంది ఉపాధ్యాయ స్థానాలకు 8 మంది బరిలో ఉన్నారు. వీరిలో పీడీఎఫ్ అభ్యర్థులు అటు ఎన్నికల ప్రచారంలోను ముందుండగా ఓటర్ల నుంచి ఆదరణ స్పష్టంగా కన్పిస్తుంది. దానిని త్రిప్పి కొట్టేందుకు అధికార వైసీపీ అధికారాన్ని అడ్డంపెట్టుకొని సామ దాన దండోపాయాలను ఉపయోగిస్తూ ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తుంది. రాజకీయాల్లో ఎన్నడూ లేని విధంగా ఎంఎల్‌సి ఎన్నికల్లో డబ్బులను విపరీతంగా పంపిణీ చేస్తూ ఓటర్లను తమ వైపు మళ్లించుకునేందుకు ప్రయత్నం చేస్తుంది. మరోపక్క వాలంటీర్లను అడ్డం పెట్టుకుని దొంగ ఓట్లను చేర్చుకున్న వైకాపా నేతలు ఆగడాలపై అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు ఉదాసీనత వైఖరి అవలంభిస్తున్నారు. మరో పక్క తెలుగుదేశం పార్టీ తమ మనుగడను కాపాడుకునేందుకు ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారంలో కూడా ముందుకు వెళ్తుంది. మొత్తం మీద ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల కోసం ఎవరికివారే ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నెల 13వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. నేటితో ప్రచారం ముగియ నుంది. జిల్లా వ్యాప్తంగా ఎక్కడైనా నలుగురు కలిసినా ఎంఎల్‌సి ఎన్నికలపైనే వాడీవేడిగా చర్చ జరుగుతుంది. బరిలో ఉన్న అధికార పార్టీ ఎన్నికల్లో విజయం సాధించి రాష్ట్ర పాలన విశాఖపట్నం నుంచి ప్రారంభించాలని చూస్తుంది.

దొంగ ఓట్లతో ప్రారంభం

ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓట్లు చేర్పించే దగ్గర నుంచి డబ్బు పంపిణీ వరకు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని దుర్వినియోగం చేస్తుంది. ఇష్టానుసారం దొంగ ఓట్లను నమోదు చేసుకున్నారు. దీనిపై సీపీఐ, సీపీఎం, తెలుగుదేశం అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. 10వ తరగతి, ఇంటర్మీడియట్ పాస్ కాని అభ్యర్థులు కూడా ఓట్లు ఉండటంతో వైకాపా ఎంతకు బరి తెగించిందో అర్థం అవుతుంది.

ఓటుకు రూ. 5వేలు

ఎంఎల్‌సి ఎన్నికల్లో విజయం సాధిం చాలనే లక్ష్యంతో అధికార పార్టీ వైకాపా ఉపాధ్యాయ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా డబ్బును విచ్చలవిడిగా పంపిణీ చేస్తుంది. ఒక్కో ఉపాధ్యాయునికి ఐదు వేల రూపాయల వరకు డబ్బులు పంపిణీ చేస్తే ఓట్లు కొనుగోలు చేస్తుంది. పీడీఎఫ్ అభ్యర్థులకు మద్దతు ఎక్కువ ఉండటంతో దానిని తగ్గించేందుకు డబ్బును ఎర చూపుతుంది. డబ్బుకు లొంగనివారి పట్ల బెదిరింపులకు బరి తెగిస్తున్నారు. ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు ఉమ్మడి జిల్లాల్లో ఉన్న ఓట్లకు ఒక్కొక్క నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జిలను ఏర్పాటు చేసి దగ్గరుండి మరీ డబ్బులు పంపిణీ చేస్తున్నారు. ఒక ప్రకాశం జిల్లాలోనే 7464 మంది ఉపాధ్యాయ ఓట్లు ఉండగా వారందరికీ డబ్బులు పంపిణీ చేసే పనిలో అధికార పార్టీ నిమగ్నమై ఉన్నప్పటికీ చాలా మంది పీడీఎఫ్ మద్దతు దారులు ఉపాధ్యా యులు డబ్బును తీసుకునేందుకు సిద్ధంగా లేకపోవడం విశేషం.

విశాలాంధ్ర
బాపట్ల జిల్లా

వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగ కల్పన లేదు..

విశాలాంధ్ర - చీరాల : వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగాలు, ఉపాధి కల్పించే పరిస్థితులు లేవని అత్యల్ప ఆదాయం వచ్చే వాలంటీర్ల ఉద్యోగాల వలన బతకలేక గంజి నీళ్ల బతుకులు అయ్యాయని వేదనాభరితంగా వాలంటీర్లు తెలుపుతున్నారని టీడీపీ చీరాల ఇంచార్జి మద్దులూరి మాలకొండయ్య అన్నారు. శుక్రవారం టీడీపీ తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కంచర్ల శ్రీకాంత్‌ను గెలిపించాలని గౌతమి స్కూల్‌లో ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మాలకొండయ్య మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు ఉంటాయని, చంద్రబాబు ప్రభుత్వంలో పది లక్షల ఉద్యోగాలు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగ కల్పన జరిగిందని ఇప్పటి ఆర్థిక మంత్రే అసెంబ్లీలో తెలిపారని అన్నారు. విద్యాధికులైన మీ ఓటు ద్వారా ప్రజల్లో చైతన్యం కలిగించి కంచర్ల శ్రీకాంత్‌ని గెలిపించాలని గౌతమి స్కూల్ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో నాతాని ఉమామహేశ్వరరావు, గొట్టిపాటి రామారావు, గంజి పురుషోత్తం, బొగ్గుల పార్థసారథి, గజవల్లి శ్రీనివాసరావు, కౌతరపు జనార్దనరావు, కొమ్మనబోయిన రజిని, కొంద్రు రత్నబాబు, గుద్దంటి చంద్రమౌళి, అందే ఉమామహేశ్వరరావు, గుర్రం వెంకటేశ్వర్లు, నిమ్మల పిచ్చయ్య, లావేటి శ్రీనివాసతేజ, తేలప్రోలు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కలంయోధుడు కోటంరాజు
జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : కలం యోధుడు కోటంరాజు రామారావు జీవిత చరిత్ర పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో శుక్రవా పట్టణంలోని బాపట్ల జర్నలిస్టు వెల్ఫేర్ అసోషియన్ కార్యాలయంలో జరిగింది. స్థానిక శాసనసభ్యులు కోన రఘుపతి పుస్కకావిష్కరణ చేశారు. కోంటంరాజు రామారావు జీవిత చరిత్రను ప్రముఖ రచయిత్రి డాక్టర్ సి. భవానీదేవి కలంయోధుడు టైటిల్‌తో రచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి సి సాయిబాబు, డబ్ల్యూ జి కే మూర్తి, జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బొద్దుకూరు ధనరాజు, సెక్రటరీ రాఘవేంద్ర అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వీధికుక్కలు పట్టివేత

విశాలాంధ్ర - కర్లపాలెం : కర్లపాలెం పంచాయితీలో ఇటీవల కాలంలో వీధి కుక్కలు పాదచారులు, వాహనదాలు వెంట పడి భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. పలుచోట్ల ప్రజలపై దాడి చేసేందుకు కూడా వెనకాడటం లేదు. ఈ నేపధ్యంలో కర్లపాలెం సర్పంచ్ నక్కా లలితకుమారి శుక్రవారం పంచాయితీ పరిధిలో ఉన్న వీధి కుక్కలను ప్రత్యేక సిబ్బంది చేత పట్టించారు. ప్రజలకు హాని కలిగించే కుక్కలను నిర్మూలించటంపై పంచాయితీ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మిగితా గ్రామాల్లో కూడా ఆయా గ్రామాల సర్పంచ్‌లు కుక్కలను పట్టించాలని కోరుతున్నారు.

నిజాయితీకే ఓటు వేయండి

విశాలాంధ్ర-పుల్లలచెరువు : శాసన మండలి ఎన్నికలు ముంగిట్లోకి వచ్చేశాయి. పలువురు అభ్యర్థులు రకరకాల వాగ్దానాలతో, కొందరయితే తాయిలాలతో మనముందుకు వస్తున్నారు. రంగురంగుల కరపత్రాలతో, పోస్టర్లతో మన మనస్సును గెలవాలని ఎంతో ప్రయత్నం చేసుకున్న పాలక పార్టీకి బుద్ధి చెప్పాలని శుక్రవారం పుల్లలచెరువులో విలేకర్ల సమావేశంలో ఏఐటీయూసీ సిఐటియు నాయ కులు రఘురాం, శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యారంగం గురించి నిరుద్యోగులకు కష్టాలు గురించి, ఉపాధ్యాయ, ఉద్యోగవర్గం పట్ల ప్రభుత్వ వైఖరి గురించి, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ సిబ్బంది గురించీ, ప్రైవేటు విద్యాసంస్థల్లోని టీచర్ల, ఉద్యోగుల గురించి, మాట్లాడుతున్న వారెవరు వారికే ఓటు వేయం దన్నారు. మనం సామాన్యులనే గెలిపించాలి.

పిడిఎఫ్ ఎమ్మెల్సీలకు తప్ప మరెవ్వరికీ ఈ చరిత్రలేదు. ప్రస్తుతం పిడిఎఫ్ అభ్యర్థులు తప్ప మరెవ్వరూ దీనికి సరిపోరుఅని వారు తెలియజేశారు ప్రస్తుతం పిడిఎఫ్ తరపున పోటీచేస్తున్న పి.బాబురెడ్డి, మీగడ వెంకటేశ్వ రరెడ్డి కూడా ఎంతో నిజాయితీ, త్యాగంతో ఉద్యమాలకు నాయకత్వం వహించిన వీరు కూడా పి.డి.ఎఫ్. ఎం.ఎల్.సి.ల వారసత్వాన్ని కొనసాగించడానికి అవకాశం కల్పించమని కోరుతున్నారు. ఈ ఇద్దరు అభ్యర్థులకు మద్దతు తెలియజేయాల్సిన బాధ్యత. మేధావులు, డాక్టర్లు, లాయర్లు, ఉపాధ్యాయులు, ఉద్యో గులకు, నిరుద్యోగులుపై ఉందన్నారు. ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు శాసనమండలి నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న పొక్కిరెడ్డి బాబురెడ, మీగడ వెంకటేశ్వ రరెడ్డిలకు మొదట ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించవలసిందిగా వారు కోరారు.